http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 21 ఫిబ్రవరి 2026

పేజీలు : 8 వెల : 5/-

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## బీఆర్ఎస్ వ్యూహం ఏంటి?

- రాజ్యసభ ఎన్నికల బరిలో నిలుస్తారా? లేదా?
- ఆసక్తికరంగా రాజకీయ సమీకరణాలు
- పార్టీ అభ్యర్థిని బరిలో నిలుపుతారా లేదా అనే విషయంపై ఉత్కంఠ
- రాజ్యసభ ఎన్నికల్లో పార్టీలు విప్ జారీ చేసే అధికారం
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పష్టమైన వైఖరి తెలిసే అవకాశం




హైదరాబాద్

రాజ్యసభ సభ్యుల ఎన్నిక విషయంలో బీఆర్ఎస్ ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీ తరఫున అసలు అభ్యర్థిని బరిలో నిలుపుతారా లేదా అన్నది తేలాల్సి ఉంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో స్పష్టమైన వైఖరి తెలిసే అవకాశం ఉన్న తరుణంలో బీఆర్ఎస్ వ్యూహం ఎలా ఉంటుందన్నది చర్చనీయాంశమైంది. రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల ప్రకటన విడుదలైంది. తెలంగాణ నుంచి రెండు స్థానాలకు ఎన్నిక కోసం ఈ నెల 26న నోటిఫికేషన్ వెలువడనుంది. వచ్చే నెల 6న పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహం అవలంభిస్తుందన్నది చర్చనీయాంశమైంది. శాసనసభలో గులాబీ పార్టీకి అధికారికంగా 37 మంది శాసన సభ్యులు ఉండగా, అందులో 10 మంది కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అయితే పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇటీవలి పురపాలక ఎన్నికల్లో బీఆర్?ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేశారు. ఆయన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలను బీఆర్ఎస్సే కైవసం చేసుకుంది.

ఫిరాయింపు ఎమ్మెల్యేల ఓట్లు మరింత కీలకం

అసెంబ్లీలోని 119 మంది ఓటు హక్కు వినియోగించుకుంటే రానున్న రాజ్యసభ ఎన్నికల్లో కోటా 40.66 అవుతుంది. అంటే ఒక్కో సీటు గెలుచుకునేందుకు 41 ఓట్లు అవసరం పడుతుంది. రెండు స్థానాలకు 82 మంది బలం కావాల్సి ఉంటుంది. రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని - మిగతా3లో


## జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్



- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏఐ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్య
- హైదరాబాద్‌లో ఏఐ రంగంలో పెట్టుబడి పెట్టాలని పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి
- యువతను ఏఐ-ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలి
- స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలి

హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఆర్టిఫిషియల్ (కృత్రిమ మేధ) ఇంటెలిజెన్స్ మంత్రిత్వ శాఖ అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభిప్రాయ పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలు పర్యవేక్షించేందుకు జాతీయ ఏఐ వార్ రూమ్ ఉండాలని ప్రతిపాదించిన సీఎం కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లోనే నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సీఎం అన్నారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఏఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రపంచమంతటినీ ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ - మిగతా3లో




## చైనా, బంగ్లాలకు భారత్ చెక్

- 'చికెన్ నెక్' సమీపంలో ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్
- రైల్ టన్నెల్- దేశంలోనే తొలిసారిగా నిర్మాణం
- భారత్ తొలి అండర్ వాటర్ రోడ్
- రైల్ టన్నెల్-36 కిలోమీటర్లలో 15.79 కిలోమీటర్లు బ్రహ్మపుత్ర నది అడుగునే
- రూ.18,662 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికలు
- పచ్చజెండా ఊపిన కేంద్ర కేబినెట్

## గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

- గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..
- డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలి
- జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలి
- అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలి



హైదరాబాద్

గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలని సూచించింది. జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆకస్మిక సందర్శనలతో పాటూ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. తనిఖీ నివేదికలను వెంటనే - మిగతా3లో

## ఏఐ ఫలాలను ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరవేద్దాం



- భారత్, అమెరికా టెక్ భాగస్వామ్యం కీలకం
- సముద్ర గర్భ కేబుల్స్‌కు గేట్‌వేగా విశాఖపట్టణం
- రూ.1.36 లక్షల కోట్లతో వైజాగ్‌లో ఫుల్ స్టాక్ ఏఐహబ్
- గూగుల్ ఫీచర్ల వినియోగం భారత్‌లోనే ఎక్కువ
- ఏఐ సమ్మిట్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కీలక ప్రకటనలు



## ఈసీకి సహాయం చేయడానికి జ్యుడిషియల్ అధికారులను నియమించాలి

- సుప్రీం కోర్టు ఆదేశం
- ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈసీకి సాయం అందించేందుకు జ్యుడీషియల్ అధికాలను నియమించాలన్న సుప్రీంకోర్టు
- ఈ మేరకు కోల్‌కతా హైకోర్టుకు సూచన
- ఫిబ్రవరి 28వ తేదీ నాటికి ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించేందుకు అనుమతి

## కవిత పార్టీ టీపీజేపీ?



- మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె
- అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు
- ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది
- కవిత తన పార్టీ పేరును టీపీజేపీగా నిర్ణయించినట్లు తెలుస్తోంది

హైదరాబాద్

ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును టీపీజేపీగా నిర్ణయించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. - మిగతా3లో

## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్

- ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం!
- ఏప్రిల్ 1 నుంచి టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపుల రద్దుకు ప్రతిపాదన
- ఇకపై ఫాస్టాగ్, యూపీఐ ద్వారా మాత్రమే టోల్ రుసుముల వసూలు
- 98 శాతానికి పైగా ఫాస్టాగ్ వినియోగంతో డిజిటల్ చెల్లింపుల వైపు మొగ్గు
- ట్రాఫిక్ జామ్‌ల తగ్గింపు, సమయం ఆదా లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం



## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్



జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఇది అత్యంత కీలకమైన అప్‌డేట్. దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాల్లో నగదు రూపంలో రుసుము చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని కేంద్ర ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు పూర్తిగా రద్దు కానున్నాయి. ఆ తర్వాత టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ మార్గాల ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ సంకేతాలు ఇచ్చింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, టోలింగ్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చడమే ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఫాస్టాగ్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 98 శాతానికి పైగా వాహనదారులు ఫాస్టాగ్ ద్వారానే టోల్ చెల్లిస్తున్నారు. ఈ విజయమే నగదు రహిత విధానం వైపు అడుగులు వేయడానికి ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఫాస్టాగ్‌తో పాటు, దేశంలోని అన్ని టోల్ ప్లాజాల్లో యూపీఐ ద్వారా చెల్లించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది ప్రయాణికులకు తక్షణ చెల్లింపునకు మరో మార్గాన్ని అందిస్తోంది. ప్రస్తుతం, వాహనం విండ్‌స్క్రీన్‌పై అతికించిన ఫాస్టాగ్ స్టిక్కర్ ద్వారా టోల్ ప్లాజా వద్ద ఆగకుండానే రుసుము ఆటోమేటిక్‌గా ఖాతా నుంచి కట్ అవుతోంది. ఈ విధానం దేశంలోని అన్ని జాతీయ రహదారులతో పాటు, 100కి పైగా రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాల్లో విజయవంతంగా అమలవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఫంక్షనల్ ఫాస్టాగ్ ఉండి కూడా నగదు చెల్లిస్తే రెట్టింపు రుసుము, యూపీఐ ద్వారా చెల్లిస్తే 1.25 రెట్లు రుసుము వసూలు చేస్తున్నారు. తాజా ప్రతిపాదన అమలైతే, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గుతాయి. ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవుతుంది. టోల్ ఆపరేటర్లకు నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, టోల్ వసూళ్లలో ఆడిట్ నియంత్రణ మరింత సులభతరం అవుతుంది. నగదుపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించి, టోలింగ్ వ్యవస్థను 100 శాతం డిజిటలైజ్ చేయడమే లక్ష్యమని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడితే, 2026 ఏప్రిల్ నుంచి జాతీయ రహదారులపై ప్రయాణం పూర్తిగా క్యాష్‌లెస్ అనుభవంగా మారనుంది.

## ఈసీకి సహాయం చేయడానికి జ్యుడిషియల్ అధికారులను నియమించాలి



బంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై సుప్రీం కోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కమిషన్‌కు సహాయం చేయడానికి జిల్లా ప్రస్తుత, మాజీ న్యాయమూర్తులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఈసీ, బంగాల్ ప్రభుత్వం పరస్పరం ఆరోపణలు చేసుకోవటం దురదృష్టకరమని పేర్కొంది. బంగాల్ ప్రభుత్వం తగిన సంఖ్యలో గ్రేడ్-ఎ అధికారులను నియమించకపోవటాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.
అదేవిధంగా, ఈనెల 28వ తేదీ నాటికి ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించేందుకు అనుమతి ఇచ్చింది. అనుబంధ ఓటరు జాబితా తర్వాత ప్రకటించాలని సూచించింది. ఎస్ఐఆర్‌లో పాల్గొనే జ్యుడీషియల్ అధికారులకు రవాణా సదుపాయంతోపాటు భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది.

## పెళ్లి అయ్యే వరకు ఫోన్ మాట్లాడంపై నిషేధం- వధూవరులిద్దరికీ ఆ కమ్యూనిటీ వింత షరతు!

ప్రస్తుత కాలంలో పెళ్లి కుదిరిందంటే చాలు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో ముచ్చట్లు మొదలుపెట్టేస్తున్నారు. వివాహానికి ముందే అన్ని విషయాలను పంచుకుంటున్నారు. అందుతో తమ వ్యక్తిగత, కుటుంబ విషయాలు కూడా ఉంటున్నాయి. ఈ క్రమంలో మనస్పర్థలు, అనుమానాలు, అపోహలతో చాలా మంది పెళ్లికి ముందే విడిపోతున్నారు. నిశ్చితార్థం (ఎంగేజ్‌మెంట్) అయినప్పటికీ వివాహం వరకు బంధం కొనసాగట్లేదు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో సేన్ కమ్యూనిటీ (సమాజం) కీలక నిర్ణయం తీసుకుంది. తమ సామాజిక వర్గానికి చెందిన వధువరూలిద్దరూ నిశ్చితార్థం తర్వాత తమకు కాబోయేవారితో ఫోన్ మాట్లాడడంపై నిషేధం విధించింది.

**ఏకగ్రీవంగా నిర్ణయం**


నిశ్చితార్థం తర్వాత చాలా పెళ్లిళ్లు ఆగిపోవడాన్ని బలోద్ జిల్లాలోని సేన్ కమ్యూనిటీ చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లి వరకు తమకు కాబోయే భాగస్వామితో వధూవరులిద్దరూ రహస్యంగా ఫోన్‌లో మాట్లాడకూడదని నిర్ణయించింది. కాబోయే భర్త లేదా భార్యతో కుటుంబ సభ్యుల సమక్షంలో మాట్లాడొచ్చని స్పష్టం చేసింది. కాబోయే భార్యాభర్తలు ఒకరితో ఒకరు రహస్యంగా ఫోన్‌లో మాట్లాడడంపై నిషేధం విధించింది. ఈ మేరకు సేన్ కమ్యూనిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆధునిక యుగంలో ఫోన్లు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని సేన్ కమ్యూనిటీ బరోద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్? కౌశిక్ అభిప్రాయపడ్డారు. అందుకే మళ్లీ పాత విధానాలను అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. నిశ్చితార్థం అయిన తర్వాత వివాహం వరకు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో రహస్యంగా మాట్లాడకూడదని నిర్ణయించామని తెలిపారు. ఇటీవల కాలంలో తమ సామాజిక వర్గానికి చెందిన నిశ్చితార్థమైన చాలా జంటలు పెళ్లికి ముందే విడిపోయానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొబైల్ ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

**'నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'**

తమ సామాజిక వర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని సేన్ కమ్యూనిటీ కార్యదర్శి సీమా కౌశిక్ తెలిపారు. సుదీర్ఘమైన ఆలోచనల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. "నిశ్చితార్థం తర్వాత మొబైల్ ఫోన్‌లలో మాట్లాడే ధోరణి సేన్ కమ్యూనిటీలో అనేక సంఘటనలకు దారితీసింది. చాలా మంది యువతీయువకులు నిశ్చితార్థం చేసుకున్నప్పటికీ, ఆ బంధం పెళ్లి వరకు వెళ్లలేదు" అని సీమా కౌశిక్ అభిప్రాయపడ్డారు.

# చైనా, బంగ్లాలకు భారత్ చెక్

ఒకే ఒక్క కీలక ప్రాజెక్టుతో చైనా, బంగ్లాదేశ్‌లకు భారత్ చెక్ పెట్టబోతోంది. దేశంలోనే తొలిసారిగా అసోంలోని బ్రహ్మపుత్ర నది కింద ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మాణానికి భారత్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మన దేశ భద్రతకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్ కింద దాదాపు రూ.18,662 కోట్లతో ఈ టన్నెల్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. పొరుగున ఉన్న చైనా, బంగ్లాదేశ్ నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి ఇదెలా సహాయపడుతుంది ? ఈ ప్రాజెక్టు వల్ల బార్డర్‌లో భారత ఆర్మీ బలం ఎంతమేర పెరుగుతుంది? సిలిగురి కారిడార్ (చికెన్ నెక్ కారిడార్) భద్రతను ఈ టన్నెల్ ఎలా బలోపేతం చేస్తుంది? ఈశాన్య రాష్ట్రాలకు కలిగే ప్రయోజనాలేంటి? ఈ కథనంలో తెలుసుకుందాం.



**36 కి.మీ.లో 15.79 కిలోమీటర్లు నది అడుగునే**

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ అంటే రెండు టన్నెల్స్ పక్కపక్కనే ఉంటాయి. ఒక టన్నెల్‌లోని రైలుపట్టాల మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. మరొక టన్నెల్‌లోని రోడ్డు మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. బంగాల్ రాష్ట్రంలో ఉత్తర దినాజ్‌పుర్ జిల్లాలోని తీన్ మిలే హాత్ నుంచి డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి నగరానికి 11 కిలోమీటర్ల దూరంలోని రంగపాణి పట్టణం వరకు 36 కిలోమీటర్ల పరిధిలో ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను నిర్మించనున్నారు. ఈ టన్నెల్ రోడ్డు, రైలు మార్గాల్లో బంగాల్‌తో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలను కనెక్ట్ చేస్తుంది. కీలకమైన విషయం ఏమిటంటే, ఈ సొరంగంలోని మొత్తం 36 కిలోమీటర్ల విస్తీర్ణంలో 15.79 కిలోమీటర్ల విభాగాన్ని అసోం రాష్ట్రంలో బ్రహ్మపుత్ర నది కింద నీటి అడుగున నిర్మిస్తారు. అసోంలో బ్రహ్మపుత్ర నది ఉత్తరం ఒడ్డున ఉన్న గోహ్‌పుర్ పట్టణం నుంచి బ్రహ్మపుత్ర నది దక్షిణం ఒడ్డున ఉన్న నుమాలీఘర్ వరకు నది కింద అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం జరగనుంది.

**రెండు జాతీయ రహదారులు, రెండు రైల్వే లైన్లు అనుసంధానం**

రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మించనున్న 36 కిలోమీటర్ల మార్గంలో ప్రస్తుతమున్న రెండు ట్రాక్‌ల రైల్వే లైన్‌ను నాలుగు ట్రాక్‌లుగా మారుస్తారు. ఈ టన్నెల్ ప్రాజెక్టు ఎన్‌హెచ్-15, ఎన్‌హెచ్-715 జాతీయ రహదారులతో పాటు, రెండు రైల్వే లైన్లకు కలుపుతుంది. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే జోన్ పరిధిలోని రంగియా డివిజన్‌లో గోహ్‌పుర్ వైపునున్న రంగియా-ముకోంగ్సెలెక్ రైల్వే లైన్, తీన్‌సుకియా డివిజన్‌లో నుమాలీఘర్ వైపునున్న ఫుర్కేటింగ్-మరియాని లూప్ లైన్‌లను ఈ ప్రాజెక్టు కనెక్ట్ చేస్తుంది.

**240 కి.మీ దూరం 34 కి.మీకు తగ్గిపోతుంది!**

ప్రస్తుతం జాతీయ రహదారి మార్గంలో అసోంలోని నుమాలీఘర్ - గోహ్‌పుర్ పట్టణాల మధ్య 240 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దూరాన్ని వాహనంలో ప్రయాణించడానికి సగటున 6 గంటల టైం పడుతుంది. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అందుబాటులోకి వచ్చాక నుమాలీఘర్, గోహ్‌పుర్ మధ్య కేవలం 34 కిలోమీటర్ల దూరమే ఉంటుంది. నుమాలీఘర్ నుంచి గోహ్‌పుర్‌కు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు.

**బ్రహ్మపుత్ర తీరప్రాంతం దశ తిరుగుతుంది!**

అసోంలోని నుమాలీఘర్ అనేది ప్రధాన పారిశ్రామిక కేంద్రం. నుమాలీఘర్ రిఫైనరీ లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ చమురు కంపెనీ అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. నుమాలీఘర్, గోహ్‌పుర్‌ల మధ్య రైల్, రోడ్ కనెక్టివిటీ పెరిగితే అసోం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, వ్యాపార వికాసం రెక్కలు తొడుగుతాయి. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అనేది అసోంలోని 11 ఆర్థిక కేంద్రాలు, 3 సామాజిక కేంద్రాలు, 2 పర్యాటక కేంద్రాలు, 8 లాజిస్టిక్స్ కేంద్రాలను కలుపుతుంది. రాష్ట్రంలోని 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలు, 2 లోతట్టు జలమార్గాలకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. దీనివల్ల వస్తు,ఉత్పత్తులు, ప్రయాణికుల రాకపోకలు వేగవంతం అవుతాయి. మొత్తంమీద ఈ టన్నెల్ ప్రాజెక్ట్ అసోం పరిధిలో దాదాపు 80 లక్షల రోజుల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అసోం సహా ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వేగంగా సహాయక సామాగ్రిని, రెస్క్యూ టీమ్‌లను తరలించే వీలు కలుగుతుంది.

**చైనా, బంగ్లాదేశ్‌లకు చెక్- భారత సైన్యానికి కొత్తమార్గాలు**

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ బంగ్లాదేశ్ సరిహద్దులోని రెండు సైనిక స్థావరాల దాకా వెళు ంది. ఆ స్థావరాలకు శరవేగంగా సైనికులు, ఆయుధాలను చేరవేసే వీలు కలుగుతుంది.
బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో మరో మూడు కొత్త సైనిక స్థావరాలను భారత సైన్యం నిర్మిస్తోంది. వీటిలో ఒకటి బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో, మరొకటి బంగాల్‌లోని చోప్రాలో, ఇంకొకటి అసోంలోని ధుబ్రిలో ఉన్నాయి.
వీటికి చేరువగా ఈ రైలు-రోడ్డు మార్గం వెళుతుంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌ల అంతర్జాతీయ సరిహద్దులు ఈ రైలు-రోడ్డు సొరంగ మార్గానికి చాలా దగ్గరగా ఉంటాయి. సైనిక ఘర్షణలు తలెత్తితే, ఈ టన్నెల్ మార్గంలో వేగంగా మూడు దేశాల సరిహద్దుల సమీపం వరకు భారత్ ఆయుధాలు, సైనికులను తరలించగలదు.
బంగాల్‌లోని సిలిగురి కారిడార్‌ను చికెన్ నెక్ కారిడార్ అంటారు. ఇది నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనాలోని చుంబీ లోయలకు అత్యంత సమీపంలో ఉంటుంది. సిలిగురి నగరం పరిధిలోని బాగ్ డోగ్రా విమానాశ్రయం సమీపం నుంచే ఈ టన్నెల్‌ను నిర్మించనున్నారు.
బంగాల్‌లోని సిలిగురి సమీపంలోనే భారత సైన్యానికి బెంగ్‌డుబి సైనిక స్థావరం ఉంది. సిలిగురి కారిడార్ భద్రతకు ఇది కీలకమైంది. ఈ సైనిక స్థావరానికి కూడా చేరువగానే రోడ్ - రైల్ టన్నెల్ ఉంటుంది
బంగాల్‌లోని సుక్నాలో భారత ఆర్మీకి చెందిన 33వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం ఉంది. దీన్నే త్రిశక్తి కార్ప్స్ అంటారు. ఇది కూడా టన్నెల్‌కు చేరువగానే ఉంటుంది. అత్యవసరాలు, యుద్ధ పరిస్థితుల్లో త్రిశక్తి కార్ప్స్ దళాలు ఈ టన్నెల్ మీదుగా రైళ్లు, వాహనాల ద్వారా సరిహద్దుల దాకా చేరుకోగలుగుతారు.
ప్రపంచంలో నీటి అడుగున రైల్వే సొరంగాలు ఎక్కడున్నాయి? డెన్మార్క్, స్వీడన్ దేశాలు భారత్ కంటే ముందే నీటి అడుగున రోడ్ కమ్ రైల్ టన్నెల్‌ను నిర్మించాయి. నీటి అడుగున నిర్మించిన అతి పొడవైన రైల్వే సొరంగంగా ఓరెసుండ్ టన్నెల్ రికార్డును సాధించింది. దీని మొత్తం పొడవు 16 కి.మీ. ఇందులో దాదాపు 4 కి.మీ భాగాన్ని సముద్రం కింద నిర్మించారు. ఈ టన్నెల్ డెన్మార్క్‌లోని కోపెన్ హగెన్ నగరాన్ని, స్వీడన్‌లోని మాల్మో నగరంతో అనుసంధానిస్తుంది. 2000 సంవత్సరంలోనే దీని నిర్మాణం పూర్తయింది. ఈ టన్నెల్‌లో మొత్తం 5 ట్యూబ్‌లు ఉన్నాయి. వీటిలోని రెండు ట్యూబ్‌లలో నాలుగు లేన్ల రోడ్లు ఉన్నాయి. మిగతా రెండు ట్యూబ్‌లలో రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇంకొక ట్యూబ్‌లను అత్యవసరాల కోసం సిద్ధంగా ఉంచారు. ఈ సొరంగంలో వెంటిలేషన్, లైటింగ్, అధునాతన సెక్యూరిటీ ఫీచర్స్ ఉన్నాయి. అసోంలో బ్రహ్మపుత్ర నది కింద టన్నెల్ నిర్మాణం పూర్తయ్యాక భారత్ పేరు కూడా డెన్మార్క్, స్వీడన్ లాంటి దేశాల సరసన చేరనుంది.

# ఏఐ ఫలాలను ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరవేద్దాం

'ఇది వేగవంతమైన పురోగతి, కొత్త ఆవిష్కరణల యుగం'అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. అయితే వీటితో అత్యుత్తమ ఫలితాలే వస్తాయని కచ్చితంగా చెప్పలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాంటి కొత్త ఆవిష్కరణలతో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఫలాలు ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. అమెరికా సారథ్యంలోని టెక్ కూటమి 'పాక్స్ సిలికా'లో భారత్ చేరికపై దిల్లీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య టెక్ భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. 'పాక్స్ సిలికా' కూటమిలోకి భారత్ చేరనున్న నేపథ్యంలో ఆ కూటమిలోని అన్ని దేశాలకు పిచాయ్ అభినందనలు తెలిపారు. అమెరికా సారథ్యంలోని 'పాక్స్ సిలికా' కూటమిలో చేరిక వల్ల ఏఐ టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, అరుదైన ఖనిజ నిక్షేపాలతో ముడిపడిన అంతర్జాతీయ సప్లై చైన్లకు భద్రత, రక్షణ లభిస్తాయన్నారు.

**భారత ప్రభుత్వంతో కలిసి ఏఐ యాప్స్ తెస్తాం**

'ఏఐ విభాగంలో భారత్ అసాధారణమైన భవిష్యత్తును చూడబోతోంది. ఇందుకోసం మేం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తాం. కొత్త ప్రోడక్ట్స్, సామర్థ్యం పెంపు, మౌలిక వసతుల పెంపు ద్వారా చేయూతను అందిస్తాం. భారతీయ కస్టమర్లు, వ్యాపారాలు, డెవలపర్ల కోసం ఏఐ ప్రోడక్ట్స్, సాఫ్ట్‌వేర్లను తయారు చేసే దిశగా ప్రస్తుతం కసరత్తు చేస్తున్నాం. ఏఐ కోచ్ సాఫ్ట్‌వేర్ కోసం 22 గెమ్మా ఓపెన్ సోర్స్ లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్‌ను ఇప్పటికే విడుదల చేశాం' 'కొత్త ఏఐ ప్రోడక్ట్స్ అభివృద్ధి విషయంలో మేం భారత ప్రభుత్వంతోనూ కలిసి



పనిచేస్తున్నాం. రైతులకు సకాలంలో వాతావరణ సూచనలను అందించే, రోగుల్లో డయాబెటిక్ రెటినోపతిని గుర్తించే ఏఐ యాప్‌లను ప్రభుత్వంతో కలిసి తీసుకురాబోతున్నాం.వీలైనన్ని ఎక్కువ భారతీయ భాషల్లో ఈ యాప్‌లు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు.

**ఆ ఫీచర్లను భారత్‌లోనే ఎక్కువ వినియోగిస్తున్నారు**

'సర్కిల్ టు సెర్చ్, లెన్స్ లాంటి గూగుల్ స్కామ్ డిటెక్షన్ ఫీచర్లను ప్రపంచంలో ఎక్కువగా భారత్‌లోనే వినియోగిస్తున్నారు. జెమిని యాప్ వినియోగం యావత్ ప్రపంచంలో శరవేగంగా పెరుగుతోంది. ఆ యాప్ 10 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది. ఎంతోమంది భారతీయ కంటెంట్ క్రియేటర్లు యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి భారతీయ సంగీతం, కళలు, సంస్కృతిని చూపిస్తున్నారు' 'భారతీయులకు ఏఐ స్కిల్స్‌ను నేర్పడంపైనా మేం ఫోకస్ పెట్టాం. ఇందుకోసం గూగుల్ ఏఐ స్కిల్స్ ప్రోగ్రాం నడుస్తోంది. కోటిమంది భారతీయులకు ఏఐ టూల్స్‌పై అవగాహన కల్పించాలని మేం టార్గెట్‌గా పెట్టుకున్నాం. విద్యార్థులు, కొత్తగా టెక్ ప్రొఫెషన్స్‌లోకి ఎంటరయ్యే వారికి గూగుల్ ఏఐ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు మేం వాధ్వానీ ఏఐ కంపెనీతో కలిసి పనిచేస్తున్నాం. ఈ వారం ఆరంభంలోనే దీనిపై నిర్ణయం జరిగింది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు.

**సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌కు గేట్‌వేగా విశాఖపట్టణం**

'భారత్‌లోనే తొలి ఫుల్ స్టాక్ ఏఐ హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడి పెడతాం. ఆ ఏఐ హబ్ సామర్థ్యం గిగావాట్ల స్థాయిలో ఉంటుంది. దానివల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు ఉద్యోగాలు, ఏఐ టెక్నాలజీ ఫలాలు, కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తాయి. భారత్, అమెరికాల మధ్య డిజిటల్ ట్రేడ్ రూట్ల ఏర్పాటులోనూ గూగుల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇరుదేశాల నడుమ వారధిగా పనిచేస్తుంది. అందుకోసం విశ్వసనీయమైన డిజిటల్ ప్రోడక్ట్స్, సముద్రగర్భ కేబుల్స్, ఏఐ హబ్‌లు అవసరం' 'ఇండియా- అమెరికా కనెక్ట్ కార్యక్రమాన్నీ మేం ఇప్పటికే ప్రకటించాం. దీనిలో తొలి ప్రధాన అంతర్జాతీయ సముద్ర గర్భ గేట్‌వేగా విశాఖపట్నం నిలుస్తుంది. వైజాగ్ నుంచి సింగపూర్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల వరకు సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ కనెక్ట్ అవుతాయి. ముంబయి టు పశ్చిమ ఆస్ట్రేలియా వరకూ సముద్ర గర్భ కేబుల్స్ ఏర్పాటు అవుతాయి. కొత్తగా అమెరికా ఏర్పాటు చేసిన పాక్స్ సిలికా కూటమి ఈవిధమైన సప్లై చైన్ల భద్రతకు హామీ ఇస్తోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వివరించారు.

# రిటైర్ అవుతారా? రిటర్న్ అవుతారా?- రాజ్యసభ పోల్స్ వేళ శరద్ పవార్ ప్లాన్ ఏంటి?

మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం జరగబోతోం దనే సంకేతాలు కనిపిస్తున్నాయి. లేదు లేదు, కాదు కాదు అంటూనే రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ రెడీ అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో విస్తృతమైన పరిచయాలతో పాటు సుదీర్ఘ అనుభవం, జాతీయ స్థాయిలో పేరు కలిగిన 85 ఏళ్ల శరద్ పవార్‌ను రాజ్యసభకు పంపాలని యోచిస్తోంది. మహారాష్ట్రలోని 7 రాజ్యసభ సీట్లకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ఎమ్మెల్యేల సంఖ్యాబలం పరంగా మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ఒకే ఒక్కరిని రాజ్యసభకు పంపగలుగుతుంది. ఆ ఒక్క అవకాశాన్ని శరద్ పవార్ పొందబోతున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీన్ని కాంగ్రెస్‌లోని ఓ వర్గం వ్యతిరేకిస్తోంది.

**వరుసగా మూడోసారి రాజ్యసభకు శరద్ పవార్**

రాజ్యసభకు వెళ్లాలనే కోరిక తనకు లేదని శరద్ పవార్ ఇంతకుముందే పలుమార్లు స్పష్టం చేశారు. అయితే, అజిత్ పవార్ మరణంతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారిన దృష్ట్యా ఆయన రాజ్యసభకు వెళ్లేందుకు మొగ్గుచూపుతారనే అంచనాలు వెలువడుతున్నాయి. తన పార్టీ ఎన్‌సీపీ (ఎస్‌పీ) కోసం కాకుండా, ప్రతిపక్ష ఎంవీఏ కూటమి భవిష్యత్తు కోసం రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు శరద్ పవార్ సిద్ధం అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న శరద్ పవార్, ఇప్పటివరకు కేవలం రెండుసార్లే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2014లో భారత రాజకీయాల్లో బీజేపీ ప్రభంజనం మొదలయ్యాక, శరద్ పవార్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఈవిధంగా 2014, 2020లో రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్న శరద్ పవార్ పదవీకాలం 2026 ఏప్రిల్?తో ముగియనుంది. దీంతో వరుసగా మూడోసారి ఆయన్ను రాజ్య సభకు పంపి, జాతీయస్థాయిలో ప్రతిపక్ష ఇండియా కూటమి వాణిని బలోపేతం చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్‌ను ఫిబ్రవరి 18వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహారాష్ట్రలో మొత్తం 288 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఒక సీటును గెలవాలంటే కనీసం 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో శరద్ పవార్ ఎన్‌సీపీ, కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన ఉన్నాయి. ఈ కూటమికి 50 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అత్యధికంగా ఉద్ధవ్ శివసేనకు 20 మంది, కాంగ్రెస్‌కు 16 మంది, శరద్ ఎన్‌సీపీకి 10 మంది, సమాజ్ వాదీ పార్టీకి ఇద్దరు, పీజాంట్స్ అండ్ వర్కర్స్, సీపీఐ పార్టీలకు చెరొక ఎమ్మెల్యేలు ఉన్నారు. 7 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఒకే ఒక సీటును గెలిచే బలం మహా వికాస్ అఘాడీ కూటమికి ఉంది. ఇటీవలి కాలంలో శరద్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యంపై రాజకీయ వర్గాల్లో హాట్ డిబేట్ నడుస్తోంది. శరద్ పవార్ ఎన్‌సీపీ భవిష్యత్తులో బీజేపీలో విలీనం అవుతుందనే ఆందోళన కాంగ్రెస్‌లోని ఒక వర్గం నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ రాజ్యసభ ఎన్నికల్లో విపక్ష ఎంవీఏ కూటమికి లభించే ఒక్కగానొక్క రాజ్యసభ సీటును శరద్ పవార్‌కే కేటాయిస్తే,

# జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్

-మొదటిపేజీ తరువాయి
ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత తదితర అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమన్నారు. దిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించిన సీఎం మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో గుర్తుచేశారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని ఇది మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని సీఎం అభివర్ణించారు.

### ఏఐ రోడ్‌మ్యాప్ అవసరం

మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని అన్నారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం చెప్పారు. పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్ ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలన్నారు. దేశానికి తక్షణ జాతీయ ఏఐ రోడ్‌మ్యాప్ అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, అప్లికేషన్ల అభివృద్ధిలో భారత్ స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు.



### ఏఐ వార్‌రూమ్ ఏర్పాటు చేయాలి

ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్రం--రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లోనే ఆ వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై తలెత్తుతున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చనన్నారు. అయితే సరైన రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

### మేం సిద్ధం

యువతను ఏఐ-ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే ఏఐ స్టార్టప్ విలేజ్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరారు. సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ఆయన కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం స్పష్టం చేశారు "ఏఐ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. గ్రీన్ ఎనర్జీ, డేటా స్టోరేజ్, అప్లికేషన్స్‌లో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉంది. కేంద్ర రాష్ట్రాల్లో ఏఐ అభివృద్ధిని పర్యవేక్షించేందుకు వార్?రూంను ఏర్పాటు చేయాలి. ఆ రంగంలో మరింత వృద్ధిని సాధించేందుకు వార్?రూం ఉపయోగపడుతుంది. హైదరాబాద్?లో ఏఐ వార్? రూం ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఏఐ రంగంలో అగ్రగామిగా ఉండేందుకు జీపీయూ, చిప్స్?ల తయారీ యూనిట్లను ఏర్పాటు చేయాలి. జీఎస్టీ కౌన్సిల్ తరహాలో ఏఐ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలి."

# హైదరాబాద్‌లో హాట్ కేకుల్లా ప్లాట్లు..
## 14 ప్లాట్ల వేలంతో రూ.14.75 కోట్ల ఆదాయం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లకు నిర్వహించిన వేలంలో భారీ ధర పలికాయి. 14 ప్లాట్లను వేలం వేయగా.. ఏకంగా రూ.14.75 కోట్ల ఆదాయం సమకూరింది. చదరపు గజానికి కనీస ధర రూ.32 వేలు నిర్వహించగా.. గరిష్ఠంగా రూ.51 వేలకు విక్రయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మరో విడత వేలం ఈనెల 23న నిర్వహించనున్నారు.శరవేగంగా డెవలప్ అవుతున్న హైదరాబాద్ మహా నగరంలో ఖాళీ ప్లాట్లు దొరకడమే గగనం అయిపోయింది. ప్లాట్లు కొనాలంటే నగర శివార్లకు వెళ్లాల్సిందే. అది కూడా భారీగా ధరలు పెట్టాల్సిందే. ఇక నగరం నడిబొడ్డున ప్లాట్లు కొనాలంటే కోట్ల రూపాయలు కుమ్మరించాల్సిందే. ఇక అప్పుడప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో స్థలాలు అత్యధిక పలికి రికార్డుల్లోకి ఎక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఖాళీ ప్లాట్లకు నోటిఫికేషన్ విడుదల చేసి.. తాజాగా వేలం నిర్వహించగా.. కళ్లు చెదిరే ఆదాయం వచ్చింది.హైదరాబాద్ నగర శివారు అయిన రాజేంద్ర నగర్ మండలంలో ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు. లక్ష్మీగూడలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. భారీ ఎత్తున స్పందన వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడ ఉన్న 14 ప్లాట్లను తాజాగా బహిరంగ వేలం జరిపారు. ఈ ప్లాట్ల విక్రయించడానికి సంబంధించి ఈనెల 2వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.బహిరంగ వేలం పాట నిర్వహించగా.. అందులో 49 మంది కొనుగోలుదారులు హాజరయ్యారు. మొదట ఈ భూములకు చదరపు గజానికి రూ.32 వేలను కనీస ధరగా హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఇక వేలంలో అనూహ్యంగా చదరపు గజం ధర గరిష్టంగా రూ.51 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ క్రమంలోనే ఏకంగా 14 ప్లాట్ల హాట్ కేకుల్లా విక్రయం అయ్యాయి.ఈ ప్లాట్లను అమ్మడం



ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ వెల్లడించారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక ఈ వేలంలో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికింది. దీంతో సగటున ఒక్కో చదరపు గజం రూ.44,285కు విక్రయం అయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.మరోవైపు.. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలం వేయడానికి హౌసింగ్ బోర్డు ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. గచ్చిబౌలి, లింగంపల్లి, కూకట్‌పల్లి, చింతల్, కుత్బుల్లాపూర్, నిజాంపేట ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడించింది. భరత్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద 1106 గజాలు.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో 266 గజాలు.. బౌరంపేటలో 2,600 గజాలు, చింతల్ హౌసింగ్ బోర్డు కాలనీలో 6 ప్లాట్లు.. గచ్చిబౌలి హౌసింగ్ బోర్డు కాలనీలో 3 ప్లాట్లు, నిజాంపేటలో ఒక ప్లాటు ఉందని తెలిపారు. ఈ స్థలాలకు ఈనెల 23వ తేదీన వేలం నిర్వహించనున్నట్టు వీపీ గౌతమ్ తెలిపారు. వేలం రోజు ఉదయం నాటికి డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

# అదిలాబాద్‌కు కొత్త ఎయిర్ పోర్టు

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుంది. జిల్లాలో కొత్తగా ఎయిర్‌పోర్టు కానుంది. ఈ మేరకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌ను ఎంపీ గోడం నగేష్ విడుదల చేశారు. త్వరలోనే భూసేకరణ పనులు ప్రారంభం అవుతాయని ఎంపీ వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మరికొన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ పనులు మె?దలయ్యాయి. తాజాగా.. ఆదిలాబాద్ విమానాశ్రయంపై కూడా కీలక అప్డేట్ వచ్చింది.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌కు అనుమతి వచ్చిందని ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్ ప్రతిని మీడియా ముందు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మరో 10 వేల ఎకరాల గుర్తింపునకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు రంగంలోకి దిగాక.. మాస్టర్ ప్లాన్‌లో కొంత మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయాలను వెల్లడించారు.'ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందింది. జిల్లా ప్రజలకు ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. దశాబ్దాలుగా ఈ ప్రాంతం ప్రజలు ఎయిర్ కనెక్టివిటీ కోసం ఎదురు చూస్తున్నారు. నేడు ఆ కల సాకారం కాబోతుంది. ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చుతోంది. అధికారికంగా మాస్టర్ ప్లాన్ ఆమోదించారు. త్వరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో ముందడుగు వేస్తోంది. మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వాటి ఫలితమే ఈ ముందడుగు.స్థానిక ప్రజల దీర్ఘకాల డిమాండ్‌ను నిజం చేయటం కోసం నిరంతర కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ విమానాశ్రయం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే ఎక్కువ. ఇది ఆదిలాబాద్ జిల్లాకు ఒక మలుపు. మా జిల్లాను ప్రధాన నగరాలకు అనుసంధానిస్తుంది, స్థానిక వ్యాపారాలు, రైతులకు మద్దతు ఇస్తుంది, మా గిరిజన, అటవీ ప్రాంతాలకు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఆదిలాబాద్ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.' అని గోడం నగేష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



## బీఆర్ఎస్ వ్యూహం ఏంటి?

-మొదటిపేజీ తరువాయి
బీజేపీ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు దూరంగా ఉంటే, కోటా 38 అవుతుంది. రెండు స్థానాలకు 76 మంది బలం అవసరం అవుతుంది. కాంగ్రెస్‌కు ఉన్న 66 మందితో పాటు ఏడుగురు ఎంఐఎం, ఒక సీపీఐ సభ్యునితో కలిపి 74 మంది అవుతారు. రెండు సందర్భాల్లో రెండు సీట్లకు సరిపడా కోటా రాదు. కోటా రాకపోతే ద్వితీయ ప్రాధాన్య ఓట్లు, ఆ తర్వాత తొలగింపు ప్రక్రియ చేపట్టడంతో ఫిరాయింపు ఎమ్మెల్యేల ఓట్లు మరింత కీలకం అవుతాయి.

### ఏజెంట్‌కు ఓటు చూపాల్సిందే

రాజ్యసభ ఎన్నికకు రాజకీయ పార్టీ విప్ వర్తిస్తుంది. ఇదే సమయంలో ఎమ్మెల్యేలు తాము ఏ అభ్యర్థికి ఓటు వేసారనేది పార్టీ ఏజెంట్‌కు తప్పకుండా చూపాల్సి ఉంటుంది. అలా చూపకపోతే ఆ ఓటు విషయమై ఏజెంట్ తీవ్ర అభ్యంతరం చెప్పవచ్చు. గతంలో గుజరాత్‌లో ఇదే తరహాలో కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ పోటీ చేసినప్పుడు ఇద్దరు ఎంపీలు ఏజెంట్‌కు ఓటు చూపనందుకు ఎన్నికల సంఘం వాటిని లెక్కింపులోకి తీసుకోలేదు. దీంతో రాజ్యసభ ఎన్నికలో పార్టీ ఏజెంట్‌కు చూపించి మరీ ఓటు వేయడం తప్పనిసరి అని అంటున్నారు.

### రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

ఎవరికి ఓటు వేసినా పార్టీ తరపు ఏజెంట్‌కు చూపిస్తేనే ఆ ఓటు చెల్లుబాటు అవుతుందని చెబుతున్నారు. తద్వారా ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటువైపు ఓటు వేసేది తేలిపోయే అవకాశం ఉంటుందని అంటున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో గెలుపు ఓటములు ఎలా ఉన్నా, ఫిరాయింపు ఎమ్మెల్యేల వైఖరిని ఎండగట్టే అవకాశం ఉంటుందన్న చర్చ బీఆర్?ఎస్?లో నడుస్తోంది. పార్టీ అభ్యర్థిని బరిలో దింపి, విప్ జారీ చేస్తేనే అందుకు అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో గులాబీ పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరలేపింది. ఈ ఎన్నికలతో పాటు త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ప్రకటన వెలువడనున్నట్లు తెలుస్తోంది. బీఆర్?ఎస్? నాయకులు ఈ ఎన్నికల్లో సత్తా చూపాలని వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

## గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

-మొదటిపేజీ తరువాయి
అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలని హుకుం జారీ చేసింది. ప్రతి నెలా 5వ తేదీలోపు నివేదిక సమర్పణని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## కవిత పార్టీ టీపీజేపీ?

-మొదటిపేజీ తరువాయి
అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ.ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది.ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు.నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు.ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు

## కార్పోరేషన్ విభజనపై నోటీసులు




**హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని పేర్కొంటూ ఓ వ్యక్తి.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేశారు. జనగణన ముగిసేవరకు జీహెచ్ఎంసీ విభజనపై స్టే ఇవ్వాలని పిటిషనర్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇస్తూ విచారణను వాయిదా వేసింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జీహెచ్ఎంసీ )ని విభజించి 3 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ.. ఇటీవలె రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో జీహెచ్ఎంసీతోపాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)లను కొత్తగా ఏర్పాటు చేసింది. అయితే ఈ విభజనకు వ్యతిరేకంగా హైదరాబాద్‌కు చెందిన గురువారెడ్డి అనే బిజినెస్‌మెన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలకు విరుద్ధంగా జీహెచ్ఎంసీని విభజించారని.. దీనిపై స్టే విధించాలని కోరారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవలె జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ జీవో నంబర్ 55 జారీ చేసింది. ఈ జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ గురువారెడ్డి హైకోర్టుకెక్కారు. కేంద్ర ప్రభుత్వం 2027లో జనాభా లెక్కలు చేపట్టనుంది. ఈ నేపథ్యంలోనే ఈ జనాభా లెక్కలకు సంబంధించి కేంద్రం జారీ చేసిన సర్క్యులర్‌కు ఈ జీహెచ్ఎంసీ విభజన విరుద్ధమని పిటిషనర్ వాదించారు. అదే సమయంలో దేశంలో జనగణన పూర్తి అయ్యే వరకు ఈ జీవో నంబర్ 55పై స్టే విధించాలని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.జనగణన పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీని విభజించకుండా ఇంతకుముందు ఎలా ఉందో అలాగే యథావిధిగా ఉంచాలని హైకోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. అటు కేంద్ర ప్రభుత్వంతోపాటు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ చేసింది. ఈ జీహెచ్ఎంసీ విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై తర్వాతి విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం వెల్లడించింది

## సంపాదకీయం

# ఎప్స్టీన్ ఫైల్స్‌లో ప్రముఖుల బాగోతాలు

కొంతకాలంగా ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్స్టీన్ నేడు వార్తలలోని వ్యక్తి. అమెరికాలో ఒక నేరసామ్రాజ్య అధినేత. ఏకంగా 33 వేల చదరపు అడుగుల దీవి ఆయన సొంతం. న్యూయార్క్ నగరంలో అత్యంత ఖరీదైన విలాసవంతమైన భవనం నిర్మించుకున్నాడు. ఆ దేశంలో పేరున్న ఆర్థిక వ్యాపారవేత్త. ఎంతోమంది దేశాధ్యక్షులతో, ప్రధానమంత్రులతో ఎంతో సాన్నిహిత్యం, సత్సంబంధాలు నెరపిన చరిత్ర ఆయనకే సొంతం. ఒక ఆర్థిక వ్యాపారస్థుడికి ఆ స్థాయి అంతర్జాతీయ సంబంధాలు నెలకొల్పుకోవడం, నిలబెట్టుకోవడం ఆశ్చర్యమే. కానీ అది ఎప్స్టీన్‌కే సాధ్యం. ఆయన కార్యకలాపాలు ఆ విధంగా ఉండేవి. అతడి జీవితం మొత్తం అధికారం, సెక్స్, నేరం, రాజకీయాల చుట్టే తిరిగేది. అందుకే ఆయన మరణించి ఏడేళ్లు అవుతున్నా ఇంకా వార్తల్లో నిలిచి ఉన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైనాడు. దేశాధినేతల వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేశాడు. వారు విమర్శలపాలై, వారి పదవికి ఎసరుపెట్టే విధంగా ఉన్న చరిత్ర ఆయనది. చివరికి ఆయనతో సంబంధాలు ఉన్నవారు, వారి కుటుంబ సభ్యుల చేతనే విమర్శలకు గురవుతున్న పరిస్థితి. ఇంతగా ప్రపంచం మొత్తాన్ని కదిలించి వేస్తున్న ఎప్స్టీన్ ఫైల్స్ నిజంగా తెలుసుకోదగినవే. జెఫ్రీ ఎప్స్టీన్ మీద మొదట 1996లో మరియ ఫార్మర్ అనే మహిళ తన అక్కాచెల్లెళ్ల నగ్న ఫోటోలను దొంగిలించాడని కేసు నమోదైనా విచారణ జరగలేదు. కానీ 2005లో మరొక మహిళ తన 14 ఏళ్ల సవతి కూతురిని ఎప్స్టీన్ ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో రేప్ చేసినట్లు ఆరోపించింది. అమెరికన్ విచారణ సంస్థ ఎఫ్‌బిఐ మరో 35 మంది ఆడపిల్లల కథలు కూడా గుర్తించి 2008లో ఎప్స్టీన్‌ను శిక్షార్హుడిగా గుర్తించింది. కానీ విచిత్రంగా ఎక్కడా జరగని నాన్ ప్రాసిక్యూషన్ అగ్రిమెంట్ జరిగింది. కేవలం 18నెలలు మాత్రమే ఆయన జైలులో ఉన్నాడు. అంతేకాదు ఆ రకమైన శిక్ష తగ్గించబడింది. ఆ అగ్రిమెంట్ ప్రకారం పగటిపూట అతడు బయట తిరగవచ్చు. రాత్రిపూట మాత్రమే జైలు శిక్ష అనుభవిస్తాడు. మళ్లీ తన వ్యాపారాన్ని నేర సామ్రాజ్యాన్ని విస్తరింపచేశాడు. అనేక దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, శాస్త్రజ్ఞులు, హాలీవుడ్ నటులు ఆయన ఆహ్వానం మేరకు కలవగా వారికి అమ్మాయిలను ఎర చూపి వారితో సంబంధాలు నెలకొల్పుకున్నాడు. ప్రపంచంలోని అనేక దేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు అందులో భాగమయ్యారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, లండన్ యువరాజు వంటి ప్రముఖులు సైతం ఆయనచే ప్రభావితం అయ్యారు. భారతదేశం నుండి ప్రధాని నరేంద్ర మోడీ, మంత్రి హరీదీప్ సింగ్ పూరి, ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేర్లు కూడా ఈ ఫైల్స్‌లో ఉండడం గమనార్హం. 2014లో భారతీయ జనతా పార్టీలో చేరిన హరిదీప్ సింగ్ 2017లో నరేంద్ర మోడీ మంత్రివర్గంలో చేరాడు. అంతకు ముందు ఒక ఐఎఫ్ఎస్ అధికారి అయిన పూరి రాయబారిగా పనిచేశాడు. కానీ పెట్రోలు సహజవాయువుల శాఖ మంత్రి అయిన తర్వాత అనేక మెయిల్స్, చాట్ చేసినట్లుగా ఈ ఫైల్స్‌లో బయటపడినాయి. తాను కేవలం సాంకేతిక విషయాలపైనే ఈ విధంగా ఆయనతో మెయిల్స్, చాట్ చేసినట్లు పూరి బుకాయిస్తున్నాడు. అంతకుముందు 2013 వరకు పూరి భద్రతామండలి సభ్యుడు కూడా. ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కూడా మార్చి 2017లో ఎప్స్టీన్‌తో లావాదేవీలు జరిపినట్లు ఫైల్స్ పేర్కొంటున్నాయి. అందుకు ప్రతిగా భారతీయ మార్కెట్‌కు కట్టబెట్టడానికే ప్రయత్నాలు జరిగాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ విధానంలో మార్పు కూడా కేవలం అతడి వల్లనే కలిగినట్లు విమర్శలు ఉన్నాయి. ఆ ఫైల్స్‌లో ఆ రకమైన ఆధారాలు ఉన్నాయి. అప్పటివరకు పాలస్తీనా, ఇజ్రాయెల్ విషయంలో పాలస్తీనాను సమర్థిస్తూ వచ్చిన మోడీ అమెరికా అధ్యక్షుడితో చర్చల అనంతరం తన విధానాన్ని మార్చుకొనడం జరిగింది. ఇజ్రాయెల్‌ను సమర్థించడంలో ఎప్స్టీన్, డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి మేరకే ఆ విధంగా జరిగినట్లు ఈ ఫైల్స్ ద్వారా తెలుస్తున్నది. ఈ విధంగా ఎప్స్టీన్ అనేక విధాలుగా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తారంగా వాడుకుంటూ అనేక దేశాలను ప్రభావితం చేశాడు. ఇంతటి మహా సామ్రాజ్య నిర్మాత ఎప్స్టీన్ 2019లో మాన్‌హట్టన్ జైలులో మరణించాడు. ప్రపంచంలోని పెద్దల బండారం బయటపడకుండా ఉండటానికి అతడిని చంపారని కూడా ఒక విమర్శ లేకపోలేదు. అతడి సహచరి, నిందితురాలు మాక్స్వెల్ కూడా 2021లో జైలు శిక్షకు గురైంది. జనవరి 30, 2026 నాడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ అమెరికా విడుదల చేసిన ఎప్స్టీన్ ఫైల్స్ మూడు లక్షల పేజీల డాక్యుమెంట్. 1,80,000 ఫోటోలు 2000 వీడియోలతో కూడినది. 300 గిగా బైట్ల సమాచారం ఈ ఫైల్స్‌లో నిక్షిప్తమై ఉంది. నవంబర్ 18, 2025లో ఎప్స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌ఫరెన్సీ చట్టాన్ని ఆమోదించి దశలవారీగా ఈ ఫైల్స్ ను విడుదల చేయడంతో అనేక వాస్తవాలు వెలుగులోకి రావడంతో ప్రపంచం నివ్వెరపోయింది. డొనాల్డ్ ట్రంప్, ఎప్స్టీన్‌ల మధ్య సంబంధం 1980 చివర నుండి నడుస్తూ వస్తున్నది. ఎప్పుడు కూడా మంచి అందమైన అమ్మాయిలను తనలాగే ఎప్స్టీన్ ఇష్టపడేవాడని ట్రంప్ అభివర్ణించాడు. ఈ ఫైల్స్‌లో ఎవరి పేరు ఉటంకించబడిన వారికి అది అవమానమే. ట్రంప్ నుండి ప్రయోజనాల కోసం మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును కలిసినట్లు అర్థమవుతున్నది. కానీ జాతీయ స్థాయి ప్రధానస్రవంతి మీడియా మాత్రం నోరు మెదపడం లేదు. ఈ ఫైల్స్‌లో మోడీ పేరు అనేక సార్లు చెప్పబడింది. ఇజ్రాయెల్‌ను మొట్టమొదటగా సందర్శించిన భారత ప్రధానిగా మోడీ చరిత్రలోకి ఎక్కారు. అమెరికా మెడలు వంచాం అని బయటకు బీరాలు పలికే మన ప్రధాని ఈ విధంగా ట్రంప్ నుండి ఏవో ప్రయోజనాలు ఆశించి ఈ విధంగా ఈ ఫైల్స్‌లో దొరికిపోవడం జరిగింది. 2016లో రాఫెల్ డీల్ జరిగింది. అప్పటివరకు యుద్ధ విమానాల తయారీలో ఏమాత్రం అనుభవం లేని కొత్తగా పుట్టుకొచ్చిన రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్‌కు ఇజ్రాయెల్‌కు 51:49 నిష్పత్తిలో ఈ డీల్ కుదిరింది, టెండర్ దక్కింది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు కూడా ధ్రువీకరించడం జరిగింది. ఫిబ్రవరి 2017 నుండి ఎప్స్టీన్, అనిల్ అంబానీ మధ్య సత్సంబంధాలు పెరిగాయి. ఈ విధంగా ఎప్స్టీన్ ఫైల్స్ దేశవిదేశాల్లో రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ఒక నేరచరిత్ర కలిగిన వ్యక్తి అందమైన టీనేజ్ అమ్మాయిలను ప్రముఖులకు చేరవేస్తూ అట్టి వ్యక్తులతో సంబంధాలు నెలకొల్పుకొని రాజకీయంగాను, ఆర్థికంగానూ బలపడ్డాడు. దురదృష్టవశాత్తు మన దేశ ప్రధాని, ఒక మంత్రి, ఒక బడా పారిశ్రామికవేత్త ఈ ఫైల్స్‌లో అనేక మార్లు పేర్కొనబడటం మనకు కూడా తలవంపులు కలిగించే విషయం. దేశ రక్షణ కొనుగోళ్లకు సంబంధించిన రాఫెల్ డీల్‌లో కూడా ఎప్స్టీన్ పాత్ర చాలా గణనీయమని ఈ డాక్యుమెంట్స్ ద్వారా తెలుస్తున్నది. ఇంతకాలంగా అణచివేతకు గురవుతున్న పాలస్తీనాకు నైతిక మద్దతునిచ్చిన మన దేశం అకస్మాత్తుగా తన విధానాన్ని మార్చుకొని ఇజ్రాయెల్‌కు మద్దతు పలకడం కేవలం అమెరికాతో సత్సంబంధాలు కొనసాగించడానికి అనేది సుస్పష్టం. ప్రముఖులకు, దేశాధినేతలకు అమ్మాయిలను ఎరవేసి తన వ్యాపార విస్తరణ చేసుకుంటూ దేశాధినేతలతో ఇతడు పరిచయాలు పెంచుకున్న విధానం కచ్చితంగా అనుమానించదగినదే. ఒక మామూలు టీచర్‌గా తన జీవితాన్ని ప్రారంభించి ప్రపంచ నేతలకు యువతులను ఉపయోగించి లోబరుచుకున్న నీచ వ్యక్తి నేడు భౌతికంగా లేకపోయినా అతని ఫైల్స్ దేశదేశాల్లో భూకంపం పుట్టిస్తున్నాయి. తన దీవికి ఆహ్వానించి విందులు ఏర్పాటు చేసి దేశాధినేతల మధ్య పరిచయం కలిగించిన ఒక బ్రోకర్ గా మనం ఎప్స్టీన్‌ను వర్ణించవచ్చు. రాజకీయ నాయకులు స్వచ్ఛందంగా తమ పదవుల నుండి వైదొలగుతున్న పరిస్థితి నేడు ప్రపంచంలో కనబడుతున్నది కేవలం ఈ ఫైల్స్ లో వారి పేర్లు బయటపడిన కారణంగా మాత్రమే. ఈ ఫైల్స్‌లో 300 మంది ప్రముఖుల పేర్లు ఉన్నాయి. 1200 నుండి 1500 పేర్లు ఏదో ఒక నేరంతో ముడిపడి ఉన్న పరిస్థితి. మొత్తంగా 23,000 మంది పేర్లు ఈ ఫైల్స్ నిండా ఉటకించబడి ఉన్నట్లుగా చెబుతున్నారు. పేర్లు ఉన్న వారందరూ నేరస్థులుగా మనం పరిగణించలేం. కానీ ఫైల్స్‌లో వారి ప్రస్తావన ఉండడం అనుమానాస్పదం, అవమానకరం. బ్రిటన్‌లో ఇద్దరుముగ్గురు రాజీనామా చేశారు. లేబర్ పార్టీ నాయకుడు, ఇంకా ప్రిన్స్ ఆండ్రు తమ పదవుల నుండి తప్పుకున్నారు. కొందరు బహిరంగంగా క్షమాపణ చెప్పారు. విచారణలు మొదలైనాయి.


# భారత పరిశోధనా పితామహుడు



శాంతి స్వరూప్ భట్నాగర్ (ఫిబ్రవరి 21, 1894 ? జనవరి 1, 1955) గురించి తెలియని వారుండరు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రజ్ఞుడు భట్నాగర్. భట్నాగర్ ను భారత పరిశోధన శాలల పితామహుడిగా అభివర్ణిస్తారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రథమ డైరెక్టర్. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (జఉఅ) తొలి మొదటి ఛైర్మన్. దేశంలో మొత్తం 12 పరిశోధన శాలలను ఆయన స్థాపించాడు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం స్థాపించింది. శాంతి స్వ రూప్ భట్నాగర్ బ్రిటిష్ ఇండియా లోని పంజాబ్ ప్రాంతంలోని, ఇప్పటి పాకిస్తాన్లో ఉన్న షాపూర్లో, హిందూ కాయస్థ కుటుంబంలో 1894 ఫిబ్రవ రి 21న భట్నాగర్ జన్మించాడు. చిన్ననాటి నుండి సాహిత్యమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా విపరీతమైన ఆసక్తిని పెంచు కున్నాడు. కవిత్వం లో మంచి ప్రవేశ ముండేది. బాల్యం నుండే బొమ్మలు, యంత్ర పరికరాలు చేయటంలో ఆసక్తి కనబరిచేవాడు. తన ప్రాథమిక విద్యను దయానంద్ ఆంగ్లో-వేద ఉన్నత పాఠశాల, సికింద్రా బాద్ (బులంద్ షహర్ ) నుండి పూర్తి చేశాడు. 1911లో లాహోర్ లోని కొత్తగా స్థాపించ బడిన దయాల్ సింగ్ కాలేజీలో చేరాడు. భట్నాగర్ 1913లో పంజాబ్ విశ్వ విద్యాలయం ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యాడు. ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. 1916లో భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. విదే శాల్లో చదువుకోవడానికి దయాళ్ సింగ్ కాలేజ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్ పొంది, యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో 1921 లో సైన్స్‌లో డాక్టరే ట్ పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, కొత్తగా స్థాపించ బడిన బనా రస్ హిందూ విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా చేరా డు. తర్వాత విశ్వ విద్యాలయం లోని ఫిజికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, యూనివర్సిటీ కెమికల్ లాబొరే టరీస్ డైరెక్టర్‌గా లాహోర్‌కు మారాడు. మాగ్నెటోకెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ ఆఫ్ ఎమల్షన్ రంగాలలో పరిశోధనతో పాటు, అప్లైడ్ కెమిస్ట్రీ లో కూడా గణనీయమైన కృషి చేసాడు. రావల్పిండి ప్రాంతంలో ఒక బ్రిటిష్ కంపెనీ చమురు అన్వేషణా కార్యక్రమం చేపట్టిన రోజుల్లో ఒక సమస్య ఎదురైంది. చమురు ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండేది. పైగా డ్రిల్ చేసిన బురద ఉప్పు నీటితో కలిసి గట్టిగా రాయిలాగా మారి, డ్రిల్లింగ్ కు అంతరాయం కలిగించేది. ఒక దశలో పనిపూర్తిగా ఆగిపోయేది. అపుడు కంపెనీవారు భట్నాగర్ ను సలహా కోరారు. భట్నాగర్ ఈ సమస్యను కూలం కషంగా పరిశీలించి అతిసులభ మైన, చవకైన పరిష్కారాన్ని సూచించాడు. డ్రిల్ చేసిన బురదకు జిగురు కలపమని సలహా ఇచ్చా డు. జిగురు కలిపిన బురదకు స్నిగ్ధత తక్కువై గట్టిపడకుండా ఉండటంతో బ్రిటీష్ కంపెనీ కొన్ని లక్షల రూపాయల నష్టం నుండి బయట పడింది. వెంటనే కంపెనీ వారు ఆయనకు లక్షాయాభై వేల రూపాయలు బహుకరించారు. ఆ సొమ్మును లాహ్వారు యూనివర్శిటీకి చమురు పరిశోధనల కోసం విరాళంగా ఇచ్చాడు. భట్నాగర్ చమురు పరిశోధనా భివృద్ధికి ఎంతో కృషి చేశాడు. మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో ఆయన తెలియ చేశాడు. కిరోసిన్ ను శుద్ధి చేయ డం, వెలుగును ఎక్కువ చేయటం, ఆదా చేయడం గురించి భట్నాగర్ విలువైన సమాచారాన్ని అందించా డు. పెట్రోలియం నుండి విడుదల య్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో పరిశోధించాడు. ఆయన ఊఎఖీ కు డైరెక్టరయ్యాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్స్ చేయడం, రబ్బరు వస్తువులను రూపొందించడం వంటి పరిశోధనలను ముమ్మరం చేశాడు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ స్వయం ప్రతిపత్తి సంస్థగా, 28 సెప్టెంబర్ 1942న అమలులోకి వచ్చింది. 1943లో ఆయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎన్ను కున్నారు.

శాంతి స్వరూప్ భట్నాగర్... హోమీ జహంగీర్ భాభా, ప్రశాంత చంద్ర మహలనోబిస్, విక్రమ్ సారాభాయ్ తదితరులతో పాటు భారతదేశ స్వాతంత్ర్యానంతర శాస్త్ర సాంకేతి క మౌలిక సదుపాయాలు, విధానా ల నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించాడు. విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా మరియు ప్రభుత్వ విద్యా సలహాదారుగా కూడా పని చేశాడు. నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్థాపనలో అతను కీలక పాత్ర పోషించి, దేశంలో ఇండస్ట్రి యల్ రీసెర్చ్ అసోసియేషన్ ఉద్యమానికి నాంది పలికాడు. భట్నాగర్ భారత దేశములో వివిధ ప్రాంతాలలో... సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్ మైసూర్ , నేషనల్ కెమికల్ లాబొరేటరీ పూణే , నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ న్యూఢిల్లీ , నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ జంషెడ్‌పూర్ , సెంట్రల్ ఫ్యూయల్ ఇన్‌స్టిట్యూట్ ధన్‌బాద్ వంటి మొత్తం 12 జాతీయ ప్రయోగ శాలలను స్థాపించాడు. నెహ్రూ హయాంలో ప్రభుత్వం నుండి నిధులను సమకూర్చి చమురు పరిశోధనా వనరులను అభివృద్ధి చేశాడు. దేశంలో చమురు వనరు లు, చమురు నిక్షేప స్థావరాలు, అణుఖనిజ పరిశ్రమలు అభివృద్ధి చెందాయంటే అది భట్నాగర్ కృషే ప్రధాన కారణం. భట్నాగర్ 1955 జనవరి 1వ తేదీన మరణించాడు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్ర వేత్తలు కనబరిచిన ప్రతిభకు నిదర్శనంగా, ఆయా రంగాలకు వారు అందించిన సేవలకు గుర్తింపు గా ప్రతి ఏటా ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు భారత శాస్త్ర రంగంలో అత్యున్నతమైనదిగా పరిగణిస్తారు. ఈ పురస్కారం మొదటి సారి 1958 లో యివ్వబడి నది. 45 సంవత్సరాల వయసు వరకు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాలలో పరిశోధన చేస్తూ ఉంటే ఈ పురస్కారానికి అర్హత పొందు తాడు. ఈ పురస్కారం ఒక పతకం, నగదు బహుమతి 5 లక్షలు అందజేయ బడుతుంది. అదనంగా ఆ పురస్కార గ్రహీత 65 వ సంవత్సరం వరకు ప్రతీ నెలా రూ. 15,000 అందజేయ బడుతుంది.

# భాషా సంస్కృతులను రక్షించుకుందాం



ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయరానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగుతుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమాదంలోపడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్ కు వెళ్ళిన వ్యవసాయ కూలీలు 185 సంవత్స రాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగు వాళ్లు ఉండగా... తమ వారసులకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారిక కతను సాధించి పెట్టేందుకు కృత నిశ్చయంతో, తెలుగు భాషా మాధ్య మంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలు ఉన్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ చానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి చానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్శిటీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులు ఉన్నాయి. అంతే కాకుండా, మారిషస్ తెలుగు మహా సభ, తెలుగు సాంస్కృతిక కళా నిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావి తరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈ క్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్‌వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. ఆస్ట్రేలియా "తెలుగు సమాఖ్య, తెలుగుమల్లి, భువనవిజయం" వంటి సాంస్కృతిక సంస్థలు,16 ఏళ్లు కృషి చేసి విజయం సాధించాయి. అమెరికాలో మన తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూ ఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది, ఇది గత ఏడు సంవత్సరాలలో 86% పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3 న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా 'మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 2020 నవంబర్ 1 ఆదివారం రోజున 12 గంటలపాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించ బడింది. అంతేకాదు...మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' కార్యక్రమానికి.. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగి పోని సంఘటన. ఇదివరలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరితో కలిసి ఒక ఫెస్టివల్ జరపాలనే ఆలోచనతో సౌందర్య లహరి పేరిట అమెరికా జయహో భారతీయం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి నిశ్చయించి, తానా సంస్థ మహిళా కోఆర్డినేటర్ తూనుగుంట్ల శిరీష, జిజ్ఞాస అధినేత భార్గవ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు డాక్టర్ డి విజయభాస్కర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు లతో సంప్రదించి సౌందర్యలహరి కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంగా మార్చి ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాల నుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటి పైకి వచ్చాయి. తెలుగు చరిత్ర లో కనీవినీ ఎరుగని రికార్డ్ అది. జయహో భారతీయం- భారతదేశం, జిజ్ఞాస ? భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగుఅసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్ ? కువైట్, తెలుగు కళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగు సమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగు కల్చరల్ సొసైటీ నార్త్రెన్-ఐర్లాండ్, తెలుగు కళా సమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ ? న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాత్మెంటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి ? న్యూజి ల్యాండ్, తెలుగు కళా సమితి ? ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతో పాటు ఆయా ఆయా దేశాలలో వివిధ రాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9 కోట్ల మంది (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఎక్కువగా) తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# అధికారుల 'కరుణ'

## మహిళా సిబ్బందికి వణుకు!
## లైంగిక వేధింపుల నిందితుడికి మళ్లీ విధుల్లోకి ఎంట్రీ..
## ఆసుపత్రిలో కలకలం

**అగ్నిధార న్యూస్,(రామగుండం):** ఆసుపత్రి అంటే ప్రాణాలు పోసే చోటు.. కానీ అక్కడ పని చేసే మహిళా సిబ్బందికి మాత్రం అడుగడుగునా వేధింపులే ఎదురవుతున్నాయి. లైంగిక వేధింపుల వంటి తీవ్రమైన ఆరోపణలతో గతంలో విధుల నుంచి తొలగించబడిన వ్యక్తిని, ఉన్నతాధికారులు మళ్లీ విధుల్లోకి చేర్చుకోవడం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తీవ్ర దుమారం రేపుతోంది. మహిళా భద్రతను గాలికొదిలేసి, నిందితుడికి రెడ్ కార్పెట్ వేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఫ్లాష్ బ్యాక్: ఆత్మహత్యాయత్నం వరకు వెళ్లిన వేధింపులు**

గతేడాది ఆగస్టు 6న ఆసుపత్రిలో పని చేసే ఓ మహిళా కాంట్రాక్టు కార్మికురాలిపై సూపర్వైజర్ తాజుద్దీన్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ వేధింపులు భరించలేక సదరు మహిళ ఆసుపత్రి భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేయడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. కేవలం ఆ కార్మికురాలే కాకుండా, విధుల్లో ఉన్న నర్సులను అనుమతి లేకుండా ఫోటోలు తీయడం వంటి వికృత చేష్టలపై నర్సింగ్ సిబ్బంది అంతా ఏకమై అప్పట్లో సూపరింటెండెంట్ దయాల్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి తాజుద్దీన్‌ను విధుల నుంచి తొలగించారు.

**సిఫారసుల పర్వం.. మళ్లీ విధుల్లోకి!**

ఎన్ని ఆరోపణలు ఉన్నా, చట్టం తన పని తాను చేసుకుపోవాల్సింది పోయి.. అధికారుల అండదండలతో తాజుద్దీన్ మళ్లీ ఆసుపత్రిలో అడుగుపెట్టాడు. కలెక్టర్ సిఫారసు మేరకే అతడిని అత్యవసర విభాగంలో విధుల్లోకి తీసుకున్నామని ఆర్ఎంఓ కృపాభాయి చెప్పడం గమనార్హం. సోమవారం ఆసుపత్రికి వచ్చిన తాజుద్దీన్ హంగామా చేయడంతో మహిళా సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. "మా భద్రత కంటే సిఫార్సులే ముఖ్యమా?" అని నర్సింగ్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

**అన్యాయానికి గురైన ఎనిమిది మంది పరిస్థితి ఏంటి?**

తాజుద్దీన్ గతంలో తనపై ఎదురుతిరిగిన ఎనిమిది మంది మహిళా కాంట్రాక్టు కార్మికులను అకారణంగా తొలగింపజేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. వారిలో బాధితురాలిని కూడా ఇప్పటివరకు విధుల్లోకి తీసుకోలేదు కానీ, వేధింపులకు పాల్పడిన వ్యక్తిని మాత్రం సాదరంగా ఆహ్వానించడం ఏ రకమైన న్యాయమని కార్మికులు నిలదీస్తున్నారు.

**నిరసన సెగ తప్పదు!**

పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం ఉన్న కఠిన నిబంధనలను బుట్టదాఖలు చేస్తూ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయంపై మహిళా ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తాజుద్దీన్ నియామకాన్ని రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు. అధికారుల నిర్ణయంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## కర్రీ గుట్టలో తక్షణమే కూనీబింగ్ నిలిపి వేయాలి

**సీపీఐ ( ఎమ్ ఎల్) చంద్ర పుల్లా రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్**

**హైదరాబాద్ :** కర్రీ గుట్టలో క్యూబింగ్ చర్యలు తక్షణమే నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వ న్నీ సీపీఐ (ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ నేడొక ప్రకటనలో డిమాండ్ చేశారు.మావోయిస్టులు చర్చలకు వచ్చేందుకు మార్గం సుగమం చేయాలని కోరారు ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు మావోయిస్టులు సైతం జనజీవన స్రవంతిలో ప్రభుత్వం పిలుస్తూ మరోవైపు సాయుధ బలగాలతో క్యూబింగ్ నిలిపి వేయకుండా ఎన్కౌంటర్ లకు పాల్పడడం అంటే బీజేపీ ప్రభుత్వం ద్వంద నీతిని పాటిస్తుంది,అడవిలో లక్షల కోట్ల రూపాయల ఖనిజ సంపద కోసం, మహారాష్ట్ర,చెట్టిస్గడ్,జార్కండ్, లొ లక్షలాది చెట్లు నరికి వేయటం నిలిపి వేయాలని సూచించారు,ఒక దగ్గర చెట్టును తొలించాలంటే మరో ప్రాంతంలో కొత్త మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని గ్రీన్ ట్రై బ్యూ నల్ తీర్పును అడ్డం పెట్టుకొని ఈ చేర్యాల కు పాల్పడడం పై మండి పడ్డారు,అడివిలో ప్రకృతి సహజంగా పెరిగిన చెట్లను కొట్టేసి, వేరే ప్రాంతంలో ఈ న్నీ చెట్లు పెంచడం సాధ్యమా అని ప్రశ్నించారు, కార్పొరేట్ కంపెనీలకు ఖనిజ సంపద ను అప్పగించడం కోసం బీజేపీ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుందని విమర్శించారుమావోయిస్టు పేర్లతో మానవ హ న నానికి పాల్పడడం ,మానవత్వ నీ కే మచ్చ అని పేర్కొన్నారు,విశాల దృక్పథంతో అలో చించి అడవుల నుండి సాయుధ బలగాలను వెన్నకి రప్పించి,కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టు లతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వం న్నీ సీపీఐ( ఎమ్ ఎల్) చందు పుల్లా రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు

## నా అన్వేషణ ఇన్ స్టా అకౌంట్ బ్యాన్



**హైదరాబాద్ :** వివాదాస్పద యూట్యూబర్ నా అన్వేషణ అన్వేష్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను శాశ్వతంగా తొలగించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టడం, హిందూ దేవతలను, భారతదేశాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినందున హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు తొలగింపచేశారు. ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తూ వీడియోలు చేసే అన్వేష్, గత కొంతకాలంగా తన సోషల్ మీడియా వేదికల ద్వారా భారతదేశంపై , హిందూ దేవతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై నటి కరాటే కల్యాణి తీవ్రంగా స్పందించారు. అన్వేష్ వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, దేశ గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయని పేర్కొంటూ ఆమె హైదరాబాద్ సిసిఎస్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదును స్వీకరించిన సిసిఎస్ పోలీసులు ప్రాథమిక విచారణ జరిపారు. అన్వేష్ అకౌంట్ ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని నిర్ధారించుకున్న పోలీసులు, వెంటనే ఇన్‌స్టాగ్రామ్ ఫౌండర్స్‌కు, నిర్వాహకులకు లేఖ రాశారు. అన్వేష్ అకౌంట్ వివరాలు కావాలని కోరడంతో పాటు, అతను పోస్ట్ చేసిన వివాదాస్పద కంటెంట్ గురించి ఆ లేఖలో వివరించారు. సిసిఎస్ పోలీసులు తమ లేఖలో స్పష్టమైన ఆధారాలను పొందుపరిచారు. సమాజంలో అశాంతిని కలిగించేలా, మతపరమైన చిచ్చు పెట్టేలా ఉన్న ఈ అకౌంట్‌ను వెంటనే తొలగించాలని ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్యాన్ని కోరారు. పోలీసుల నుండి వచ్చిన ఫిర్యాదును మరియు లేఖను క్షుణ్ణంగా పరిశీలించిన ఇన్‌స్టాగ్రామ్ నిర్వాహకులు, అన్వేష్ అకౌంట్ తమ నిబంధనలను అతిక్రమించిందని భావించి, దానిని వెంటనే బ్యాన్ చేశారు.ఒకప్పుడు 1.8 మిలియన్ల ఫాలోవర్లతో ఉన్న నా అన్వేషణ ఇన్‌స్టాగ్రామ్ పేజీ, అతను చేసిన వివాదాస్పద వ్యాఖ్యల తర్వాత భారీగా ఫాలోవర్లను కోల్పోయింది. అకౌంట్ బ్యాన్ అయ్యే సమయానికి ఆ సంఖ్య 1.3 మిలియన్లకు పడిపోయింది. భారతదేశం, దేవతలపై చేసిన అనుచిత వ్యాఖ్యల వల్లే నెటిజన్లు అతనికి దూరమయ్యారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అన్వేష్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ సెర్చ్ చేసినా కనిపించడం లేదు. హిందూ దేవతలను దూషించినందుకు, దేశంపై విషం చిమ్మినందుకు అన్వేష్‌కు తగిన శిక్ష పడిందని పెద్ద ఎత్తున నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. చట్టాన్ని గౌరవించని ఏ వ్యక్తికైనా ఇలాంటి పరిణామాలే ఎదురవుతాయని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నారు

## యువత అవకాశాలు మెరుగుపరచుకోవాలి

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** రాష్ట్ర స్థాయి ప్రాజెక్ట్ ఆర్ ఏ ఎంపీ లో భాగంగా, ప్రధాన్ మంత్రి ముద్రా యోజన పి ఎం ఎం వై పై ఒకరోజు అవగాహన కార్యక్రమం ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పెదపల్లి లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల కేంద్రం డిఐసి పెదపల్లి ఆధ్వర్యంలోని ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఈ డి సి నిర్వహించింది. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రస్తుత ఎం ఎస్ ఎం ఈ యూనిట్లు, వ్యాపారాన్ని ప్రారంభించదలచిన ఔత్సాహికులు యువత పాల్గొని, ముద్రా రుణాల వర్గాలు, అర్హత ప్రమాణాలు బ్యాంకు రుణాల పొందుపరచే విధానంపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల కేంద్రం, పెదపల్లి జనరల్ మేనేజర్ శ్రీ. కీర్తి కాంత్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ ఎఫ్ ఎల్ సి ప్రతినిధి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై, స్వయం ఉపాధి ప్రోత్సాహం ఆర్థిక అవగాహన ప్రాధాన్యతపై ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి సంతోష్ విజయ్ శిక్షకులుగా వ్యవహరించి, ముద్రా యోజనకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఈ డి సి మేనేజర్ . హరీష్ , అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ సహకారంతో నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా జిల్లా యువత చిన్న వ్యాపారులలో స్వయం ఉపాధిపై ఆసక్తిని పెంచడం సంస్థాగత రుణాల పొందు పరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఈనెల 24న జాబ్ మేళా

**జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్‌లి**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి , ఫిబ్రవరి -20** జిల్లాలోని నిరుద్యోగ యువతీ ,యువకులకు సాక్సెస్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు ఫిబ్రవరి 24 మంగళవారం రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సాక్సెస్ ప్రాజెక్టు ఎల్.ఎల్.పి కంపెనీలో మొత్తం 51 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 50, మార్కెటింగ్ మేనేజర్ 1 పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు 10వ తరగతి ఇంటర్మీడియట్, డిగ్రీ ,ఎంబిఏ, మార్కెటింగ్ మేనేజర్ ఉద్యోగాలకు ఇంటర్ డిగ్రీ విద్య అర్హతలు కలిగిన వారు అర్హులని, వయస్సు 18 నుంచి 36 మధ్యలో ఉండాలని అన్నారు.ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 24న ఉదయం 11 గంటల కు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సంధ్య థియోటర్ ఘటన ఛార్జ్‌షీట్‌ను తిప్పిపంపిన కోర్టు

**హైదరాబాద్ :** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో ఛార్జ్ షీట్ను నాంపల్లి కోర్టు తిప్పిపంపింది. ఈ కేసులో పోలీసులు అల్లు అర్జున్ సహా 23 మందిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. పోలీసులు సమర్పించిన ఛార్జ్ షీట్లో సరైన సాక్ష్యాలు, ఆధారాలు లేవని, సాంకేతిక లోపాలు ఉన్నాయని ఇప్పటికే రెండు సార్లు ఛార్జ్ షీట్ ను కోర్టు తిప్పి పంపింది. దాంతో పోలీసులు మరోసారి సరి చేసి నాంపల్లి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసారు.


## తెలంగాణ అవుట్ డోర్ మీడియాకు న్యాయం చేయాలి

**తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ జిహెచ్ ఎంసి కార్యాలయం ముట్టడి**

**హైదరాబాద్ :** తెలంగాణ అవుట్ డోర్ మీడియాకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉఊఓఅ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ శాఖ ముఖ్యమంత్రి దగ్గర ఉండటంతో మా అసోసియేషన్ కు గత 2 సంవత్సరాల నుండి అపోయింట్మెంట్ లేక ఇబ్బంది పడుతున్నాం మా సమస్యలు పరిష్కరించడానికి అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పుడు ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకు వస్తుంది, ఇదిచాలా మంచి విషయం కానీ ఈ పాలసీ వల్ల ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న 450 కంపెనీలు రోడ్ మీద పడేసి ఒక మూడు కంపెనీ లకు మాత్రమే వ్యాపార అవకాశాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.ప్రైవేట్ బిల్డింగ్ పైన ఇప్పుడు ఉన్న వేలాది హోర్డింగ్స్ తీసేసి కొంతమందికే 2,3 కంపెనీలు మాత్రమే వ్యాపారం చేసుకొనే పరిస్థితి కల్పిస్తున్నారు అని వాపోయారు.ఇక్కడ ప్రైవేట్ భవనాల మీద మరియు ప్రైవేట్ భూముల్లో హోర్డింగ్ లు ఏర్పాటు చేసి ప్రభుత్వానికి పన్నులు చెల్లించే వాటిని తొలగించి, ప్రభుత్వ భూముల్లో ఖీ అండ్ ః రోడ్ల మీద ఎలాంటి పన్నులు లేకుండా 2 లేదా 3 ఏజెన్సీ లను ప్రభుత్వం సమర్థిస్తున్నట్లు ఆ పాలసీ వస్తుంది వాఎరు పేర్కొన్నారు. గత ప్రభుత్వం కొంతమంది కోసం ఉూ ఓసీ. 68 తీసుకొచ్చి సిటీని వాళ్లకు సంబంధించిన వారికి కట్టబెట్టారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోంది అనిపిస్తుంది.. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయం వళ్ళ రాష్ట్రంలో షుమారు 450 ఏజెన్సీలు 50 వేల కుటుంబాలు రోడ్ న పడతాయి, రాష్ట్రంలో ప్రత్యేకంగా హైదరాబాద్ లో 1927 నుండే అవుట్ డోర్ హోర్డింగ్ లు ఉండేవి. అలాగే ఇప్పుడు కూడా మన దేశంలో అన్ని రాజధానుల్లో ప్రైవేట్ బిల్డింగ్స్ పైన హోర్డింగ్స్ ఉన్నాయి, దయచేసి అనుమతి ఇస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని వారు విజ్ఞప్తి చేసారు. ఇక నైనా ప్రభుత్వం మధ్యవర్తుల మాటలని మరియు ఒక మూడు ఏజెన్సీల మాటలని పక్కన పెట్టి అందరికీ ఆమోదయోగ్యమైన పాలసీని తీసుకొచ్చి మమ్మల్ని ఆదుకోవాలి అని వారు ముఖ్యమంత్రి ని కోరారు.

## ఐఎన్‌టీయూసీ ఉమ్మడి రాష్ట్రాల కార్యదర్శిగా తిరుపతి

**నియమించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి**



**అగ్నిధార న్యూస్,( రామగుండం):** జాతీయ కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యదర్శిగా రామగుండం ప్రాంతానికి చెందిన పూసాల తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, వి.భాస్కర్‌రెడ్డి, నాయకులు జనక్ ప్రసాద్, బాబర్ సలీం పాషా, సత్యజిత్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, నాగన్న గౌడ్‌లకు తిరుపతి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రాల బాధ్యతలు అప్పగించడంపై స్థానిక కార్మిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## టీఎస్ సిపిఎస్ ఈయు నూతన క్యాలెండర్ ఆవిష్కరణ




**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్ /గండీడ్:** ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టీఎస్ సిపిఎస్ ఈ యు నూతన సంవత్సర క్యాలెండర్ ను, స్థానిక మండల విద్యాధికారి రుద్రారం జనార్ధన్ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో మండల టీఎస్ సి.పి.ఎస్.ఈ.యు జిల్లా సంయుక్త కార్యదర్శి ఈ. కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దోమ లక్ష్మయ్య, పి. ఆర్.టి.యు టి.ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, టి. ఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు గంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, పి.ఆర్.టి.యు తెలంగాణ మండల అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, టి.జి.యు. ఎస్ మండల అధ్యక్షులు లావుడ్యా రవీందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లావుడ్యా కిషన్, శ్రీనివాస్,అంగడి అరుణ దేవి, భారతి, మంజుల, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు స్కూల్ కాంప్లెక్స్ విజయవంతం



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండిడ్:** ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మొదటిరోజు 50% ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించడం జరిగింది. పాఠశాలల వారిగా ఎఫ్.ఎల్.ఎస్ మాక్ టెస్ట్ ఒకటి, మాక్ టెస్ట్ రెండు నిర్వహించిన వాటి గురించి చర్చించడం జరిగింది. మూడవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఎఫ్ఎల్ఎస్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని అదేవిధంగా ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ అప్లై చేయించాలని ఉపాధ్యాయులకు చెప్పడం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాధికారి రుద్రారం జనార్ధన్, ఆర్.పి.లు కుర్మయ్య, మహిపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, సంజీవ రెడ్డి, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కిషన్, లక్ష్మణ్, శ్రీనివాస్, అంగడి అరుణదేవి, భారతి, మంజుల, పి.ఆర్.టి.యు టి.ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, టి. ఎస్. యు. టి.ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పగిడ్యాల్ బోరు కృష్ణయ్య,టి. జి.యు.ఎస్ మండల అధ్యక్షులు రవీందర్, సి.పి. ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దోమ లక్ష్మయ్య, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సి. ఆర్. పి లు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

**రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభినందించిన కలెక్టర్**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, ఫిబ్రవరి-20:** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులను శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఫిబ్రవరి 17న హైదరాబాద్ లోని దోమలగూడ లో ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ (జబొూచీ) విద్యార్థుల కోసం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పెద్దపెల్లి జిల్లాకు చెందిన 20 మంది సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని అన్నారు.జూలపల్లి మండలానికి చెందిన బడుగు సందీప్ జిగ్ జాగ్ వాకింగ్ లో 1వ బహుమతి , కమాన్ పూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందినఎడునూరి పౌర్ణమి చెస్ పోటీలో 1వ బహుమతి, రొంపికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కటకం శ్రీరామ్ చరణ్ పరుగుపందెంలో 1వ బహుమతి, మ్యూజికల్ చైర్ లో 2వ బహుమతి, జిగ్‌జాగ్ వాకింగ్ లో 2వ బహుమతి సాధించారు.విజేతలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి శారద ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి జి.శారద, ఐఈ కోఆర్డినేటర్ జి. కవిత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగల్లో ఈ వీటిని కలిపి తీసుకున్నారంటే..!



పెరుగును చిలకడం ద్వారా మజ్జిగ తయారు చేస్తారు. ఉప్పు, జీలకర్ర పొడి, పుదీనా వేసుకోవడం వల్ల దాని రుచి పెరుగుతుంది. మజ్జిగ సూపర్ సమ్మర్ స్పెషల్ డ్రింక్ అవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరుస్తుంది. అంతేకాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. వేసవి కాలంలో మనల్ని మనం చల్లగా ఉంచుకోవడానికి ఆహారంలో అనేక పదార్థాలను చేర్చుకుంటాము. కాలానుగుణ పండ్లు, కూరగాయలతో పాటు వివిధ రకాల పానీయాలను కూడా తీసుకుంటాము. వీటన్నింటిలో అతి ముఖ్యమైనది మజ్జిగ. పెరుగును చిలకడం ద్వారా మజ్జిగ తయారు చేస్తారు. ఉప్పు, జీలకర్ర పొడి, పుదీనా వేసుకోవడం వల్ల దాని రుచి పెరుగుతుంది. మజ్జిగ సూపర్ సమ్మర్ స్పెషల్ డ్రింక్ అవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరుస్తుంది. అంతేకాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అయితే, మజ్జిగలో ఒక్క స్పూన్ అల్లం రసాన్ని కలిపి తీసుకుంటే రెట్టింపు ప్రయోజనాలు పొందుతారని మీకు తెలుసా..? మజ్జిగలో చెంచా అల్లం రసాన్ని కలిపి తీసుకుంటే చాలా మంచిదని పోషకాహార, ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఒక టేబుల్ స్పూన్ అల్లం రసం మజ్జిగలో కలుపుకొని తాగితే బరువు తగ్గడానికి సహాయం చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మజ్జిగలో కొద్దిగా అల్లం రసం కలిపి తాగితే అతిసారం తగ్గుతుంది. ఇందులోని లాక్టోజ్, కార్బోహైడ్రేట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచడంలో జీవక్రియను పెంచడంలో సహాయపడుతుంది. ఇది బరువు తగ్గడానికి దారితీస్తుంది. ప్రతిరోజూ గ్లాసుడు మజ్జిగలో ఒక స్పూన్ అల్లం రసం కలిపి తాగడం వల్ల కొవ్వు కణాల విచ్ఛిన్నం ప్రక్రియను ప్రోత్సహిస్తుంది. అల్లం యాంటీఆక్సిడెంట్లలో సమృద్ధిగా ఉంటుంది. ఇవి శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షిస్తాయి. మీ రోజువారీ ఆహారంలో మజ్జిగ, అల్లం రసాన్ని చేర్చుకోవడం వల్ల మీ రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. ఇది సీజనల్ వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడుతుంది.


## రోజూ స్నాక్స్‌గా వీటిని తినేయండి



చర్మాన్ని ఆరోగ్యంగా, మెరుస్తూ ఉంచేందుకు ఖరీదైన ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. మార్కెట్లో లభించే క్రీములు, మందులు, సౌందర్య సాధనాలు చర్మానికి తాత్కాలిక మెరుపును ఇస్తాయి. అయితే ఇవి అంత ప్రభావవంతంగా ఉండవు. అందంగా కనిపించాలని అమ్మాయిలు నానాతంటాలు పడుతుంటారు. చర్మాన్ని ఆరోగ్యంగా, మెరుస్తూ ఉంచేందుకు ఖరీదైన ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. మార్కెట్లో లభించే క్రీములు, మందులు, సౌందర్య సాధనాలు చర్మానికి తాత్కాలిక మెరుపును ఇస్తాయి. అయితే ఇవి అంత ప్రభావవంతంగా ఉండవు. కాబట్టి రసాయన ఉత్పత్తులపై ఎక్కువగా ఆధారపడటానికి బదులుగా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, హైడ్రేషన్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మీ చర్మ కాంతి సహజంగానే పెంచుకోవచ్చు. కాబట్టి ఖరీదైన ఉత్పత్తులకు ఖర్చు చేసే బదులు సరైన ఆహార అలవాట్లు పాటించడం ద్వారా చర్మానికి ప్రతిరోజూ తగినంత పోషణ అందించవచ్చు. విటమిన్ సి చర్మానికి అత్యంత శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లలో ఒకటి. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. పిగ్మెంటేషన్ తగ్గిస్తుంది. సూర్యుని వేడి నుంచి చర్మాన్ని రక్షిస్తుంది. కాబట్టి నారింజ, కివి, బొప్పాయి, స్ట్రాబెర్రీలు, బేరి వంటి విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు రోజు వారీ ఆహారంలో భాగంగా చేర్చుకోండి.

డ్రై ఫ్రూట్స్: బాదం, వాల్‌నట్‌లు, అవిసె గింజలు, చియా గింజలు చర్మాన్ని మృదువుగా ఉంచడంలో, పొడిబారడాన్ని ఆరోగ్యంగా మార్చడంలో ప్రభావవంతంగా ఉంటాయి. ఎందుకంటే వాటిలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ డ్రై ఫ్రూట్స్ అవసరమైన పరిమాణంలో తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.పాలకూర, మెంతులు, బ్రోకలీ వంటి ఆకుకూరల్లో ఐరన్, ఫోలేట్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అవి శరీరాన్ని నిర్విషీకరణ చేసి రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా చర్మానికి సహజమైన మెరుపును ఇస్తాయి. కాబట్టి వీటిని తీసుకోవాలి.ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మాన్ని లోపలి నుంచి పోషిస్తాయి. చిలగడదుంపలను క్రమం తప్పకుండా తినడం వల్ల చర్మ కాంతి పెరుగుతుంది. ముడతలు తగ్గుతాయి. దానిమ్మ ఆరోగ్యానికి నిధి మాత్రమే కాదు, అందమైన చర్మాన్ని పొందడానికి రహస్యం కూడా. దానిమ్మను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ముడతలు, ఫైన్ లైన్స్ కూడా తగ్గుతాయి. బొప్పాయి రుచికరంగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. కడుపును శుభ్రంగా ఉంచుతాయి. బొప్పాయి శరీరం నుంచి విషాన్ని తొలగించడంలో సహాయపడుతుంది. ఇది చర్మంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. దోసకాయలు, పుచ్చకాయలలో నీరు పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మాన్ని రోజంతా హైడ్రేట్ గా ఉంచుతుంది. పెరుగు వంటి ప్రోబయోటిక్ ఆహారాలు పేగుతో సహా ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తాయి. ఇవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాతో కూడా పోరాడతాయి. చర్మ ప్రకాశాన్ని పెంచడంలో సహాయపడతాయి.

## కొత్తగా జిమ్‌కు వెళ్తున్నారా?



బాడీ ఫిట్‌నెస్ కోసమో .. హెల్దీ లైఫ్ కోసమో .. జిమ్‌లో అడుగు పెట్టాలని నిర్ణయించుకోవడం మీ ఆరోగ్యానికి మీరు ఇచ్చుకునే అతిపెద్ద బహుమతి. అయితే, జిమ్‌లో ఉత్సాహంగా వర్కవుట్లు మొదలుపెట్టే ముందు కొన్ని కనీస జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. సరైన సన్నద్ధత లేకపోతే జిమ్ ప్రయాణం ఉత్సాహంగా సాగకపోగా, అనవసరమైన నొప్పులకు దారితీసే అవకాశం ఉంది. కొత్తగా జిమ్‌కు వెళ్లేవారు పాటించాల్సిన ముఖ్యమైన నియమాలేంటో చూద్దాం. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం జిమ్‌లో చేరడం అనేది ఒక గొప్ప ముందడుగు. కానీ, జిమ్‌కు వెళ్లడం అంటే కేవలం అక్కడ ఉన్న మెషిన్లను వాడటం లేదా బరువులు ఎత్తడం మాత్రమే కాదు. బాడీ బిల్డింగ్ లేదా వెయిట్ లాస్ ప్రయాణం సజావుగా సాగాలంటే దానికి కొన్ని నియమాలు ఉన్నాయి. చాలామంది మొదటి రోజే ఉత్సాహంతో వెళ్ళి, రెండో రోజు ఒళ్లు నొప్పులతో మంచం పడతారు. అలా జరగకుండా ఉండాలంటే మీరు కొన్ని వస్తువులను, పద్ధతులను మీ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి.

సరైన దుస్తులు, బూట్లు.. చాలామంది వ్యాయామం అలవాటు అయ్యే వరకు ఏదో ఒక పాత బూట్లు లేదా బిగుతుగా ఉండే సాధారణ దుస్తులతో మేనేజ్ చేద్దామనుకుంటారు. కానీ ఇది సరైన పద్ధతి కాదు. నాసిరకం బూట్లు వాడటం వల్ల పాదాల నొప్పి మాత్రమే కాకుండా, మోకాళ్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. వర్కవుట్ చేసేటప్పుడు పాదాలకు సరైన గ్రిప్ ఇచ్చే స్పోర్ట్స్ షూస్ తప్పనిసరి. అలాగే గాలి ఆడని దుస్తులు ధరిస్తే శరీరం త్వరగా వేడెక్కి, విపరీతమైన చెమట వల్ల మీరు త్వరగా అలసిపోతారు. కాబట్టి, శరీరానికి సౌకర్యంగా ఉండే ట్రాక్ సూట్లు ఎంచుకోవడం వల్ల మీ ఉత్సాహం రెట్టింపవుతుంది. వ్యాయామం చేసేటప్పుడు శరీరం చెమట రూపంలో ద్రవాలను కోల్పోతుంది. దీనివల్ల బాడీ డీహైడ్రేషన్ బారిన పడి కళ్లు తిరగడం, విపరీతమైన నీరసం వచ్చే అవకాశం ఉంది. అందుకే ఎప్పుడూ ఒక వాటర్ బాటిల్‌ను వెంట ఉంచుకోండి. వర్కవుట్ మధ్యలో దాహం వేసినప్పుడు ఒకేసారి లీటర్ల కొద్దీ నీరు తాగకుండా, చిన్న చిన్న గుటకలు వేస్తూ ఉండాలి. ఇది మీ గుండె వేగాన్ని అదుపులో ఉంచి, మీరు ఎక్కువ సేపు వ్యాయామం చేసేలా సహకరిస్తుంది. జిమ్‌లోకి వెళ్లగానే నేరుగా హెవీ వెయిట్స్ ఎత్తడం వంటివి చేయకూడదు. మీరు చేసే వ్యాయామం ఏదైనా సరే, దానికి ముందు శరీరాన్ని సిద్ధం చేయడానికి వార్మ్‌అప్ తప్పనిసరి. మొత్తం వ్యాయామ సమయంలో పావు వంతు సమయాన్ని దీనికే కేటాయించాలి. ఇది కండరాలను ఫ్లెక్సిబుల్‌గా మారుస్తుంది. ఇక ఒంటిని సాగదీసే స్ట్రెచింగ్ వ్యాయామాలను వర్కవుట్ చివర్లో చేయడం వల్ల మరుసటి రోజు ఒళ్లు నొప్పులు రాకుండా ఉంటాయి. ఫిట్‌నెస్ అనేది ఒక్క రోజులో వచ్చేది కాదు. దానికి క్రమశిక్షణ, ఓపిక చాలా అవసరం. సరైన ఆహారం తీసుకుంటూ, పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తే మీ జిమ్ ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతుంది. ఫలితాల కోసం తొందరపడకుండా ప్రతిరోజూ చిన్న మార్పులను ఆస్వాదించండి.



## బరువు తగ్గాలని అల్పాహారం మానేస్తున్నారా?

బరువు తగ్గాలనే లక్ష్యంతో ఉన్నవారికి ప్రస్తుతం వినిపిస్తున్న ఏకైక మంత్రం 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్' . సోషల్ మీడియాలో సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ దీని గురించి చర్చించుకుంటున్నారు. అయితే, కేవలం గంటల లెక్కన ఉపవాసం ఉంటే సరిపోతుందని చాలామంది భావిస్తుంటారు. ఇందులో మనం చేస్తున్న ఒక చిన్న పొరపాటు మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ మానేసి రాత్రి ఆలస్యంగా తినే అలవాటు ఉంటే జాగ్రత్త పడాల్సిందే అంటున్నారు నిపుణులు. నేటి కాలంలో ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెరిగింది. బరువు తగ్గడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో భాగంగానే నిర్ణీత సమయం మాత్రమే ఆహారం తీసుకుంటూ, మిగిలిన గంటలన్నీ ఉపవాసం ఉండే పద్ధతి ప్రాచుర్యం పొందింది. సాధారణంగా 16 గంటల ఉపవాసం, 8 గంటల భోజన సమయం పాటిస్తుంటారు. అయితే, ఈ క్రమంలో ఏ సమయంలో తింటున్నామనేది అత్యంత కీలకం. జీవ గడియారం.. మన శరీరానికి ఒక అంతర్గత గడియారం ఉంటుంది. పగలు పని చేయడానికి, రాత్రి విశ్రాంతి తీసుకోవడానికి మన అవయవాలు అలవాటు పడి ఉంటాయి. పగటిపూట ఇన్సులిన్ పనితీరు చాలా చురుగ్గా ఉంటుంది. రాత్రి అయ్యేకొద్దీ అది తగ్గుతుంది. శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకునే సమయంలో మనం ఆహారం తీసుకుంటే, అది జీర్ణం కావడం కష్టమవుతుంది అంటున్నారు నిపుణులు. అంటే, మనం పగలు తినే ఆహారం శక్తిగా మారుతుంది, కానీ రాత్రి ఆలస్యంగా తినే ఆహారం కొవ్వుగా పేరుకుపోతుంది. చాలామంది ఉదయం అల్పాహారం మానేసి, రాత్రిపూట భారీ భోజనం చేస్తున్నారు. ఇది మన శరీర జీవక్రియలకు వ్యతిరేకంగా పోరాడటమే అంటున్నారు నిపుణులు. ఉదయం 8 లేదా 10 గంటలకే ఆహారం తీసుకోవడం ప్రారంభించే 'ఎర్లీ టైమ్ రిస్ట్రిక్టెడ్ ఈటింగ్' పద్ధతి అత్యంత ప్రభావవంతమైనదని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. చీకటి పడగానే మన మెదడులో 'మెలటోనిన్' అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించమని ప్యాంక్రియాస్‌కు సూచిస్తుంది. ఒకవేళ మీరు రాత్రి 9 గంటలకు భోజనం చేస్తే, ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి కాక రక్తంలో చక్కెర స్థాయిలు అలాగే ఉండిపోతాయి. దీనివల్ల భవిష్యత్తులో డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. బరువు తగ్గాలనుకునే వారు బ్రేక్‌ఫాస్ట్ మానేయడం కంటే రాత్రి భోజనాన్ని మానేయడం లేదా చాలా త్వరగా ముగించడం వల్ల అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని సూచిస్తున్నారు నిపుణులు. సాయంత్రం 4 లేదా 6 గంటలకే భోజనం ముగించడం వల్ల, నిద్రపోయే సమయంలో శరీరం కణాల శుద్ధీకరణ ప్రక్రియను చేపడుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. గోల్డెన్ రూల్.. "ఉదయం రాజులా, మధ్యాహ్నం యువరాజులా, రాత్రిపూట పేదవాడిలా తినాలి" అనే సూత్రాన్ని పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. గడియారాన్ని చూడటం ఆపి, సూర్యుడి గమనాన్ని అనుసరించి ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోండి. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది కేవలం ఎన్ని గంటలు ఆకలితో ఉన్నామనేది కాదు, ఎప్పుడు తింటున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరూ సరైన సమయంలో ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోండి!

## బిజినెస్

### అనిల్ అంబానీకి ఈడీ తాజా సమన్లు





ఈ నెల 26న విచారణకు హాజరుకావాల్సిందిగా రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా సమన్లు జారీ చేసింది. ఈ వారంలో ఆయన విచారణకు గైర్హాజరు కావడంతో, ఈడీ తాజా సమన్లు ఇచ్చిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 10, 17 తేదీల్లో రెండు సార్లు విచారణకు అనిల్ అంబానీ భార్య టీనా అంబానీ కూడా గైర్హాజరు అయ్యారు. ఆమెకు ఈడీ తాజా సమన్లు ఇచ్చిందా, లేదా అనేది స్పష్టత లేదు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద వేర్వేరుగా వాంగ్మూలాన్ని నమోదుచేయడానికి అనిల్, టీనాలను పిలిచినట్లు ఈడీ అధికారులు తెలిపారు. 2025 ఆగస్టులో అనిల్ అంబానీ ఒకసారి ఈడీ విచారణకు హాజరయ్యారు. అనుమతి లేకుండా భారత్ విడిచివెళ్లను: ముందస్తు అనుమతి లేకుండా తాను దేశం విడిచి వెళ్లనని సుప్రీంకోర్టులో హామీ పత్రాన్ని అనిల్ అంబానీ దాఖలు చేశారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్‌నకు సంబంధించి రూ.40,000 కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై ప్రభుత్వ ఏజెన్సీలు జరుపుతున్న విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన తెలిపారు. తాను దేశం విడిచి పారిపోయే వ్యక్తిని కాదని, చట్టపరమైన ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో అనిల్ అంబానీ పేర్కొన్నారు.

### సీ-390 మిలీనియం విమానాల కోసం ఎంఆర్‌ఓ కేంద్రం



మహీంద్రా గ్రూప్‌తో కలిసి భారత్‌లో విమానాల నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయెర్ గురువారం ప్రకటించింది. భారత వాయుసేన (ఐఏఎఫ్) మీడియం ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంటీఏ) ప్రోగ్రామ్ కోసం ఎంబ్రాయెర్ సీ-390 మిలీనియం విమానాలు ఎంపికైన నేపథ్యంలో, ఈ ప్రకటన వెలువడింది. స్థానికీకరణ వ్యూహంలో భాగంగా ఎంఆర్ఓ కేంద్రాన్ని ఎంబ్రాయెర్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిపాదిత కేంద్రం సీ-390 విమానాలకు పూర్తి తోడ్పాటు అందిస్తుందని, తద్వారా విమానాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయని ఎంబ్రాయెర్ తెలిపింది. బేస్, హెవీ మెయింటెనెన్స్, నిర్మాణాత్మక తనిఖీలు, పరీక్షలు, విడిభాగాల మరమ్మతు, ఓవర్‌హాల్, ఏవియానిక్స్ సపోర్ట్, శిక్షణ వంటి పూర్తి స్థాయి సేవలను ఈ కేంద్రం అందిస్తుందని పేర్కొంది. భారత భవిష్యత్ రవాణా విమాన అవసరాలకు సీ-390 మిలీనియంను అద్భుత పరిష్కారంగా మలచడానికి రెండు సంస్థలు కట్టుబడి ఉన్నాయని వివరించింది. భారత్‌లో సీ-390 మిలీనియం మల్టీ-మిషన్ మిలిటరీ రవాణా విమానాలను ఉత్పత్తి చేయడానికి గత ఏడాది అక్టోబరులో ఎంబ్రాయెర్, మహీంద్రా గ్రూప్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి.

# ఆ ఉద్యోగులకు నోటీసులు పంపుతోన్న ఐటీ శాఖ




ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే ఉద్యోగులకు బిగ్ అలర్ట్. హై-శాలరీ ఉన్న కొంత మంది ఉద్యోగులకు ఐటీ శాఖ నుంచి నడ్జ్ నోటీసులు అందుతున్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేసే సమయంలో వెల్లడించని ఆదాయాలు, క్రిప్టో లాభాలు, ఈఎస్‌ఓపీ లాభాలు, విదేశీ ఆస్తులు, ఆదాయాల వంటి అంశాల్లో లోపాలను సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఈ నోటీసులను ఐటీ శాఖ జారీ చేస్తోంది. ఇది ఒక మంచి అవకాశంగా చూడాలని, ఏవైనా ఆస్తుల వివరాలు మర్చిపోయి ఉంటే సరిచేసుకుని స్వచ్ఛందంగా ట్యాక్సులు చెల్లించాలని సూచిస్తోంది. కఠిన చర్యలకు ఎదుర్కోక ముందే స్వచ్ఛందంగా తమ పొరపాట్లు, తప్పులను సరిచేసుకునేందుకు ఇది చివరి అవకాశమని అధికారులు హెచ్చరించారు. ఒకే రాజకీయ పార్టీకి లేదా వివిధ స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు ఇచ్చేందుకు కొందరు ట్యాక్స్ పేయర్లు ఒకే చార్టర్డ్ అకౌంటెంట్ సేవలు ఉపయోగిస్తున్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో సంబంధిత సీఏలపై సైతం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతానికి మల్టీనేషనల్ కంపెనీల సీఈఓలు, మేనేజింగ్ డైరెక్టర్లు సహా ఉన్నతాధికారులకు ఈ నోటీసులు పంపించినట్లు తెలిపింది. భారీ పెనాల్టీలు విధించే ముందు తమ ఐటీఆర్‌లోని లోపాలను సరిచేసుకోవాలని కోరింది. అధిక ఆదాయ వర్గాల ఐటీ రిటర్నులను సమీక్షించగా ఈ ఆదాయాల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు ఐటీ శాఖ తెలిపింది. గైడ్ అండ్ ఎనేబుల్ (నడ్జ్) కార్యక్రమంలో భాగంగా సవరించిన ఐటీఆర్ ఫైల్ చేయాలని సూచిస్తోంది. నడ్జ్ నోటీసు అంటే డీఐఎన్ నంబర్‌తో వచ్చే అధికారిక పన్ను నోటీసు కాదని ట్యాక్స్ పేయర్లు గుర్తించాలి. కేవలం తమ పొరపాట్లను సరిచేసుకునేందుకు ఇచ్చే ముందస్తు హెచ్చరిక. ఐటీఆర్‌లో ప్రకటించిన ఆదాయం, ఆస్తులు సరైనవేనవే అయితే డీఐఎన్ నంబర్‌తో అధికారిక ఐటీ నోటీసు వచ్చే వరకు ఎలాంటి ఆందోళన అవసరం లేదని పన్ను నిపుణులు చెబుతున్నారు. నడ్జ్ నోటీసులు అందిన ట్యాక్స్ పేయర్లు తమ ఐటీ రిటర్నులను మరోసారి సమక్షించుకోవాలి. పూర్తి లావాదేవీల వివరాలు సేకరించాలి. అవసరమైతే సెక్షన్ 139 (8ఏ) కింద అప్డేటెట్ రిటర్న్ ఫైల్ చేయాలి. వడ్డీతో పాటు అదనపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

# ఫోన్‌పేలో రూ. 5 వేల వరకు పిన్ నంబర్ అక్కర్లేదు




యూపీఐ చెల్లింపుల కోసం ఫోన్‌పే వాడుతున్న కస్టమర్లకు భారీ గుడ్‌న్యూస్. తక్కువ మొత్తంతో లావాదేవీలు చేసేవారు ఇకపై ప్రతి ట్రాన్సాక్షన్‌కు పిన్ నంబర్‌ను ఎంటర్ చేయాల్సిన అవసరంలేదు. దేశీయ దిగ్గజ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ గురువారం యూపీఐ చెల్లింపుల కోసం సరికొత్తగా బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను ప్రారంభిస్తున్నట్టు వెల్లడించింది. కస్టమర్లు తమ స్మార్ట్‌ఫోన్ నుంచి ఫింగర్‌ప్రింట్, ఫేస్ ఐడీ ద్వారా లావాదేవీలను పూర్తి చేసేందుకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఫీచర్ రూ. 5,000 వరకు లావాదేవీలకు వేగవంతమైన 'వన్-టచ్ ' పేమెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ప్రస్తుతం రూ. 5,000 వరకు యూపీఐ చెల్లింపులకు బయోమెట్రిక్‌ను ఉపయోగించవచ్చు. ఈ పరిమితి దాటిన మొత్తం లావాదేవీలకు కస్టమర్లు పిన్ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ పరిమితి ముఖ్యంగా స్నేహితులు, కుటుంబసభ్యులు, దుకాణాల్లో ఎక్కువగా ఉపయోగపడుతుంది. రద్దీ ఉన్న ప్రదేశాల్లో, తక్కువ సమయంలో లావాదేవీలను పూర్తి చేయాల్సి వచ్చినప్పుడు ఈ ఫీచర్ ఎంతో ఉపయోగపడుతుందని, ఎవరైనా మన పిన్ నంబర్‌ను చూస్తారనే ఆందోళన ఉండదని ఫోన్‌పే అభిప్రాయపడింది. ఈ ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకోవడానికి ఫోన్‌పే యాప్‌లోని ప్రొఫైల్‌లో మేనేజ్ పేమెంట్స్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. బయోమెట్రిక్ పేను ఎంచుకుని, బ్యాంకు అకౌంట్‌ను ఎనేబుల్ చేయాలి. ఆ తర్వాత యూపీఐ పిన్, బయోమెట్రిక్ ద్వారా వన్-టైమ్ సెటప్‌ను పూర్తి చేయడమే. అయితే, ప్రస్తుతానికి ఈ ఫీచర్ ఆండ్రాయి యూజర్లకు మాత్రమే అందుబాటులోకి తెచ్చామని, త్వరలో ఐఓఎస్ యూజర్లకు కూడా అందించనున్నట్టు కంపెనీ పేర్కొంది.

## శ్రీలంకను పడగొట్టిన రాధ యాదవ్..

# ఆసియా కప్ ఫైనల్లో భారత్!



మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో భారత ఏ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ విందా దినేశ్(42), రాధా యాదవ్(32 నాటౌట్, 4-19) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో 5 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. ఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత ఏ జట్టు పంజా విసిరింది. లీగ్ దశలో అదరగొట్టిన టీమిండియా సెమీఫైనల్లోనూ చెలరేగిపోయింది. భారీ స్కోర్‌తో భారత్‌కు చెక్ పెట్టాలనుకున్న లంక ఆశలకు కెప్టెన్ రాధా యాదవ్ (4-19) అడ్డుకట్ట వేసింది. వికెట్ల వేటతో రెచ్చిపోగా.. ప్రత్యర్థి 118 పరుగులకే కుప్పకూలింది. లంక జట్టులో ఓపెనర్లు సంజనా కవింది(31), హన్సిమ కరుణరత్నే(14)లను విడదీసి తనూజ కన్వర్ బ్రేకివ్వగా.. అక్కడి నంచి రాధా యాదవ్ తిప్పేసింది. మిడిలార్డర్‌ను పడగొట్టిన తను.. లోయర్ ఆర్డర్‌ను డగౌట్ చేర్చింది. ఆఖర్లో శశిని గుహ్మాని(22) మాత్రమే రాణించగా లంక 118కి ఆలౌటయ్యింది.

**విందా, రాధ దూకుడు**

ప్రత్యర్థిని తక్కువకే కట్టడి చేసి సగం విజయం సాధించిన భారత్‌కు ఓపెనర్లు నందినీ కశ్యప(14), విందా దినేశ్‌లో (42) అదిరే ఆరంభమిచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక క్రీజునంటుకుపోయిన రాధా యాదవ్(31 నాటౌట్) లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంది. అజేయంగా నిలిచి జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది. 5 వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసిన భారత్ ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది.

### అఫ్ఘనిస్థాన్ క్రికెట్‌కు చుక్కాని.. చెరగని ముద్రతో వీడ్కోలు..!



ఒకప్పుడు అనామక జట్టుగా ఉండే అఫ్ఘనిస్థాన్ సంచలనాలకు కేరాఫ్‌గా మారడం చూసి వారెవ్వా ఏం ఆడుతున్నారు అని ఆశ్చర్యపోయాం. అంతర్జాతీయ వేదికలపై ఆ జట్టు బౌలర్లు స్టార్ ఆటగాళ్లను ముప్పతిప్పలు పెడుతుంటే వారి ప్రతిభకు సలాం కొట్టాం. మూడేళ్లలో అఫ్ఘనిస్థాన్ జట్టు ఆటలో వచ్చిన అనూహ్య మార్పులకు కారణం.. హెడ్‌కోచ్ జొనాథన్ ట్రాట్ తన క్రికెట్ బుర్రతో అఫ్ఘన్ కుర్రాళ్లను రాటుదేల్చిన ట్రాట్.. అమ్మో ఆ జట్టుతో కాస్త జాగ్రత్త అనే అభిప్రాయం కలిగించాడు. కాబూలీ టీమ్‌కు చుక్కానిలా నిలిచిన జొనాథన్ ట్రాట్ వరల్డ్‌కప్ గ్రూప్ దశ చివరి మ్యాచ్ అనంతరం బాధ్యతల నుంచి వైదొలిగాడు. భారమైన హృదయంతో వీడ్కోలు పలికిన అతడిని చూసి.. అఫ్ఘన్ ఆటగాళ్లు భావోద్వేగానికి లోనయ్యారు. ట్రాట్ సైతం తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ అద్భుతమైన జ్ఞాపకాలతో వెళ్తున్నానని చెప్పాడు. 'ఆటగాడిగానే కాదు కోచ్‌గానూ మర్చిపోలేని జ్ఞాపకాలను పోగు చేసుకున్నందుకు నేను చాలా అదృష్టవంతుడిని. వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్‌ను తొలిసారి ఓడించడం.. ఇంగ్లండ్‌ను మట్టికరిపించడం, పాక్ వంటి పెద్ద జట్టుపై ద్వైపాక్షిక సిరీస్ గెలుపొందడం మర్చిపోలేని విజయాలు' అని ట్రాట్ వెల్లడించాడు. కోచ్‌గా చెరగని ముద్ర వేసిన ట్రాట్ వీడ్కోలు ప్రకటనను అఫ్ఘన్ ఆటగాళ్లు నమ్మలేకపోయారు. తమలో ఒకడిగా ఉంటూ.. జట్టును విజయాల వైపు నడిపించిన అతడి సేవల్ని గుర్తు చేసుకున్నారు. 95 పరుగులతో కెనడాపై విజయంలో కీలకమైన ఇబ్రహీం జద్రాన్ తన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ట్రాట్‌కు అంకితమిచ్చాడు.

**వరల్డ్‌కప్‌లో సెమీస్‌కు**

చిన్నజట్టుగా క్రికెట్‌లోకి అడుగుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. బంగ్లాదేశ్ మాదిరిగానే సంచలన ఆటతో వార్తల్లో నిలిచింది. సమిష్టిగా రాణిస్తూ.. పెద్ద జట్ల పాలిట విలన్‌లా మారింది. జొనాథన్ ట్రాట్ కోచింగ్‌లో ఆ జట్టు అద్భుత విజయాలు సాధించింది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో అసాధారణ ఆటతో రెచ్చిపోయిన అఫ్ఘన్ జట్టు. మాజీ ఛాంపియన్లను శ్రీలంక, ఇంగ్లండ్, పాకిస్థాన్‌లను చిత్తు చేసింది. పొట్టి ప్రపంచకప్‌లోనూ రషీద్ ఖాన్ సారథ్యంలో దుమ్మురేపి సెమీస్‌కు చేరింది. ఐసీసీ ఈవెంట్‌లో సెమీస్ వరకూ రావడం ఆ దేశ క్రికెట్‌లో పెద్ద సంచలనం. అయితే.. పదో సీజన్‌లో మాత్రం రషీద్ సేన స్థాయికి తగ్గట్టు ఆడలేదు.


## స్పోర్ట్స్

### పాక్‌ను చిత్తు చేసిన బంగ్లాదేశ్.. ఫైనల్లో భారత్‌తో అమీతుమీ



బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న ఏసీసీ మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో బంగ్లాదేశ్-ఏ జట్టు ఫైనల్‌కు చేరింది. పాకిస్తాన్-ఏతో ఇవాళ (ఫిబ్రవరి 20) జరిగిన రెండో సెమీఫైనల్లో 54 పరుగుల తేడాతో గెలుపొంది, తుది పోరుకు అర్హత సాధించింది. ఇవాళే జరిగిన తొలి సెమీఫైనల్లో భారత-ఏ జట్టు శ్రీలంక-ఏపై 5 వికెట్ల తేడాతో గెలుపొంది, తొలి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. భారత్-ఏ, బంగ్లాదేశ్-ఏ జట్లు ఫిబ్రవరి 22న జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకుంటాయి. మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. కెప్టెన్ ఫహీమా ఖాతూన్ 40 పరుగులతో రాణించి, బంగ్లాదేశ్‌కు గౌరవప్రదమైన స్కోర్ అందించింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో ఫహీమాతో పాటు ఇష్మా తంజిమ్ (12), షమీమా సుల్తానా (13), సర్మిన్ సుల్తానా (15) రెండంకెల స్కోర్లు చేశారు. పాక్ బౌలర్లలో కెప్టెన్ హఫ్సా ఖలీద్ 2, వహీదా అక్తర్, మొమినా రియాసత్, అనోషా నాసిర్, ఒమైమా సొహైల్ తలో వికెట్ తీశారు. అనంతరం 111 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన పాకిస్తాన్.. బంగ్లా బౌలర్ల ధాటికి ఘోరంగా పతనమైంది. 16.4 ఓవర్లలో 56 పరుగులకే కుప్పకూలింది. సంజిద (3.4-0-6-3), ఫహీమా (3-0-6-2), ఫాతిమా (4-0-11-1), ఫరీహా (3-0-14-1), ఫర్జానా (1-0-6-1) పాక్ పతనాన్ని శాశించారు. పాక్ ఇన్నింగ్స్‌లో షావాల్ జుల్ఫికర్ (14), యుస్రా ఆమిర్ (11), హఫ్సా ఖలీద్ (12) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. కాగా, పురుషుల టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో బంగ్లా-పాక్ మధ్య చిగురించిన స్నేహం తర్వాత వచ్చిన ఫలితం కావడంతో ఈ మ్యాచ్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆ ఒక్క పని చేసుంటే సినిమా సూపర్ హిట్ అయ్యేది



టాలీవుడ్ ఇండస్ట్రీలో దర్శకుడిగా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో జయంత్ సి. పరాన్జీ ఒకరు. ఈయన తన కెరీర్లో ఎన్నో రీమేక్ మరియు కొత్త కథలతో రూపొందిన సినిమాలకు దర్శకత్వం వహించి విజయాలను సొంతం చేసుకున్నాడు.ఒకానొక సమయంలో ఈయన రీమేక్ సినిమాలకు దర్శకత్వం వహించనని కూడా చెప్పాడు. కానీ ఆ తర్వాత ఓ రీమేక్ సినిమాకు దర్శకత్వం వహించి చేదు అనుభవాన్ని మిగిల్చుకున్నాడు.పవన్ కళ్యాణ్ హీరోగా త్రిష, కృతి కర్బంద హీరోయిన్లుగా రూపొందిన తీన్‌మార్ మూవీని హిందీ ఫిలిం అయిన లవ్ ఆజ్ కల్ చిత్రానికి రీమేక్గా రూపొందించాడు. ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర ఫ్లాప్ను సొంతం చేసుకుంది. తాజాగా ఈ దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో భాగంగా తీన్‌మార్ సినిమా లవ్ ఆజ్ కల్ అనే హిందీ సినిమాకు రీమేక్గా రూపొందించాం. అలా రెడీ అయిన తర్వాత దానిని తెలుగు నేటివిటీకి తగ్గట్లు అనేక మార్పులు, చేర్పులు చేయాల్సింది, కానీ అలా మేమేమీ చేయకుండా రూపొందించాం. ఆ సినిమా ప్రేక్షకులకు పెద్దగా నచ్చలేదు. అదే నేను లవ్ ఆజ్ కల్ సినిమాను పవన్ కళ్యాణ్ తో చేయాలనుకున్న తర్వాత అందుకు తగినట్లు మార్పులు, చేర్పులు చేసుకున్నట్లయితే ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేదేమో అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో పవన్ రెండు పాత్రల్లో నటించాడు. బండ్ల గణేష్ నిర్మించిన ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందించాడు.

## ఆ మూమెంట్ కోసం నేను ఎదురుచూస్తున్నాను



టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ పెళ్లి గురించి గత కొంత కాలంగా ఎన్నో వార్తలు వస్తూనే ఉన్నాయి. అనుష్క నుండి కృతి సనన్ వరకు ఎంతో మంది హీరోయిన్ల పేర్లు వినిపించినా.. ప్రభాస్ మాత్రం ఎప్పుడూ తన నవ్వు తోనే సమాధానం దాటవేస్తూ వచ్చారు. కానీ తొలిసారిగా ఆయన తన మనసులోని అసలు కోరికను బయటపెట్టి ఫ్యాన్స్‌కు పెద్ద సర్ప్రైజ్ ఇచ్చారు. రీసెంట్‌గా విడుదలైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో, ఆ మూవీ టీమ్‌తో ప్రభాస్ ప్రత్యేకంగా ముచ్చటించారు. ఇంటర్వ్యూలో హీరోయిన్ మానస వారణాసి చమత్కారంగా 'ప్రేమపై మీ అభిప్రాయం ఏంటి డార్లింగ్?' అని అడిగేసరికి ప్రభాస్ కాసేపు సిగ్గుపడ్డారు. 'ఇది నీ పర్సనల్ క్వశ్చన్ కదా' అంటూనే, ఎవరూ ఊహించని సమాధానం ఇచ్చారు. "నిజం చెప్పాలంటే నాకు కూడా ప్రేమలో పడాలని ఉంది. ఆ అద్భుతమైన ఫీలింగ్‌ను అనుభవించాలని ఉంది. ఆ మూమెంట్ కోసం నేను కూడా ఆతృతగా ఎదురుచూస్తున్నాను " అని ప్రభాస్ చెప్పారు. ఈ మాట వినగానే అటు ఇంటర్వ్యూ చేస్తున్న టీమ్, ఇటు సోషల్ మీడియాలో నెటిజన్లు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఇప్పటి వరకు పెళ్లి అంటే తప్పించుకునే ప్రభాస్, ఇప్పుడు ప్రేమించాలని ఉంది అని చెప్పడం వెనుక ఏదైనా బలమైన సంకేతం ఉందా అని చర్చలు మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రభాస్ వయస్సు 46 ఏళ్లు. ఆయన వయసు హీరోలంతా పెళ్లిళ్లు చేసుకుని సెటిల్ అయిపోయినా, ప్రభాస్ మాత్రం బాక్సాఫీస్ రికార్డులను వేటాడటంలోనే బిజీగా ఉన్నారు. అయితే తాజా కామెంట్స్ చూస్తుంటే, డార్లింగ్ త్వరలోనే తన జీవితంలోకి ఒక కొత్త వ్యక్తిని ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది.

# ఇండస్ట్రీకి రాకముందు స్రవంతి..



ప్రస్తుతం తెలుగులో యాంకర్ గా మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో స్రవంతి చొక్కారపు ఒకరు. ఈమె కొంతకాలం క్రితం తెలుగు బిగ్ బాస్ షోలోకి ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపును సంపాదించుకుంది.ఆ తర్వాత స్రవంతికి వరుస పెట్టి టీవీ షోలకు, సినిమా ఈవెంట్లకు యాంకరింగ్ చేసే అవకాశం దక్కింది. దానితో ఈమెకు ఒక్కసారిగా క్రేజ్ వచ్చింది. తాజాగా ఈ బ్యూటీ సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హే బల్‌వంత్ అనే చిత్రంలో ఓ కీలకమైన పాత్రలో నటించింది. ఈ సినిమాను ఈరోజు అనగా ఫిబ్రవరి 20వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ సినిమా కోసం ఈ నటి పెద్ద ఎత్తున ప్రచారాలను నిర్వహిస్తూ వచ్చింది. ఆ ప్రచారాలలో ఈమె తనకు చాలా సంవత్సరాల క్రితమే హీరోయిన్గా అవకాశం వచ్చిందని, అంతా ఓకే అయ్యిందని, చెన్నైలో అడ్వాన్స్ కూడా ఇస్తానన్నారని, కానీ అదే సమయంలో తనకు పెళ్లయిందని చెప్పడంతో వారు ఆ తర్వాత తనను సంప్రదించలేదని తెలిపింది. ఇన్నాళ్లకు తనకు హే బల్‌వంత్ మూవీలో అవకాశం వచ్చిందని, దీనితో తనను తాను ప్రూవ్ చేసుకుంటానని చెప్పింది. ఇక తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలను తెలియజేసింది. తాజాగా స్రవంతి మాట్లాడుతూ... తాను ఇండస్ట్రీలోకి రాకముందు ఒక డైమండ్ స్టోర్లో పనిచేసేదాన్నని, అది చాలా కష్టంగా ఉండేదని, షాప్ లో ఉన్నంతసేపు నిల్చొనే ఉండాలని, అది ఎంతో బాధను కలిగించేదని, కానీ జీవితంలో ఎదగడం కోసం ఎన్నో కష్టాలను అనుభవించానని, ఇక ఆ సమయంలో జీతం తక్కువగానే వచ్చిన ఇన్సెంటివ్స్ మాత్రం బాగా వచ్చేవి, దానితో తన జీవితం గడిచిందని స్రవంతి చెప్పుకొచ్చింది.



# అదెలా సాధ్యం...

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లుగా కొనసాగాలంటే ఫిట్నెస్ అనేది చాలా ముఖ్యమైనది. అద్భుతమైన నటన ఉన్నా కూడా సరైన ఫిట్నెస్ లేనట్లయితే వారికి అవకాశాలు తగ్గే ఛాన్స్ ఉంటుంది.దానితో హీరోయిన్లు తమ బరువును కంట్రోల్లో ఉంచుకోవడం కోసం, ఫిట్ గా ఉండడం కోసం అనేక కసరత్తులు చేస్తారు, అలాగే ఫుడ్ తినే విషయంలో కూడా ఎన్నో నియమ నిబంధనలను పాటిస్తూ ఉంటారు. ఎక్కువ శాతం హీరోయిన్లు ఫ్యాట్ ఫుడ్ కు చాలా దూరంగా ఉంటారు.మరి ముఖ్యంగా కార్బోహైడ్రేట్స్ ఉన్న వంటకాలను దూరం పెడతారు. కానీ ఓ ముద్దుగుమ్మ మాత్రం కార్బోహైడ్రేట్స్ ఉన్న ఫుడ్ ను ఇష్టంగా తింటుందట, కానీ ఆమె ఇప్పటికీ ఎంతో ఫిట్ గా ఉంటూ స్టార్ హీరోయిన్లకు పోటీ ఇస్తుంది. ఆ నటి ఎవరు అనుకుంటున్నారా..? ఆమె మరెవరో కాదు.. రెజీనా కాసాండ్రా. శివ మనసులో శృతి సినిమాతో వెండితెరకు పరిచయం అయిన ఈ చిన్నది చాలా తక్కువ కాలంలోనే మంచి గుర్తింపును దక్కించుకుంది. ప్రస్తుతం కూడా ఈమె మంచి దశలోనే కెరీర్ను ముందుకు సాగిస్తుంది. తాజాగా ఈమె తన ఫుడ్ డైట్ గురించి క్లియర్గా తెలియజేసింది. తనకు సౌత్ వంటకాలు అంటే చాలా ఇష్టం అని, అందులో ముఖ్యంగా రైస్ లేకుంటే భోజనం సంతృప్తి కాదు అని తెలియజేసింది. నేను పక్కా రైస్ లవర్ ని, రోజులో కనీసం కొద్దిపాటి అన్నం అయినా తినాల్సిందే. పప్పు అన్నం, రసం అన్నం, ఇలా ఏదో ఒక రకంగా రోజు నేను తీసుకునే ఆహారంలో రైస్ కచ్చితంగా ఉంటుంది. అది లేకపోతే నా భోజనం అసంతృప్తిగా అనిపిస్తుంది అని చెప్పింది. రైస్ ఎక్కువగా తీసుకున్నప్పటికీ అందుకు తగిన వ్యాయామాలు చేసి మళ్లీ ఫిట్గా ఉంటాను అని రెజీనా చెప్పుకొచ్చింది.



# ధనుష్‌తో అలా చేయాలని కోరికగా ఉంది

టాలీవుడ్ సెన్సేషన్ మృణాల్ ఠాకూర్, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది.వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే వార్తలు వైరల్ అవ్వడంతో అభిమానుల్లో రకరకాల అనుమానాలు మొదలయ్యాయి. అయితే, ఈ వార్తలపై మృణాల్ ఇప్పటికే స్పందించి క్లారిటీ ఇచ్చినప్పటికీ పుకార్లకు చెక్ పడటం లేదు. వీరిద్దరికి సంబంధించిన ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూనే ఉంది. అంతేకాకుండా.. వారు పలు ఈవెంట్లలో సన్నిహితంగా కనిపించడంపై మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. అసలు కలిసి ఒక్క సినిమా కూడా చేయని వీరిద్దరి మధ్య ఇంతటి స్నేహం ఎలా కుదిరిందనే ప్రశ్నలు నెటిజన్ల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ?దొక పెద్ద మిస్టరీగా మారింది. ఈక్రమంలో.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్, ధనుష్‌తో తనకున్న అనుబంధంపై ఆసక్తికర విషయాలను పంచుకుంది."ధనుష్ సార్ తన సినిమా 'తేరే ఇష్క్ మే' షూటింగ్‌లో బిజీగా ఉన్నప్పుడు, నేను ఆయనను 'సన్ ఆఫ్ సర్దార్-2' స్పెషల్ స్క్రీనింగ్ కోసం ఆహ్వానించాను. ఆయన వస్తారని నేను అస్సలు అనుకోలేదు, కానీ ఆయన రావడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని మృణాల్ పేర్కొంది. ధనుష్ వంటి పెద్ద స్టార్ తన ఆహ్వానాన్ని మన్నించి రావడం పట్ల ఆమె తన కృతజ్ఞతను చాటుకుంది. ధనుష్‌పై తనకున్న అభిమానాన్ని మృణాల్ ఎంతో గొప్పగా వివరించింది. "ధనుష్ సార్ ఒక నటుడు మాత్రమే కాదు, ఆయన ఒక అద్భుతమైన సంస్థ . ఆయన గొప్ప గాయకుడు, డ్యాన్సర్, గీత రచయిత, దర్శకుడు కూడా. ఆయనలోని బహుముఖ ప్రజ్ఞను చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ధనుష్ సర్‌తో కలిసి పనిచేయాలని నాకు కోరికగా ఉంది" అని చెప్పింది.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com